ఆరుగురు సీఐల బదిలీ

నెల్లూరు(క్రైం): గుంటూరు రేంజ్ పరిధిలో ఆరుగురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా రేంజ్ వీఆర్‌లో ఉన్న జీ వేణును నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్‌కు, అక్కడ విధులు నిర్వహిస్తున్న మారుతీ కృష్ణను రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న షేక్ సుభానీని నెల్లూరు నార్త్ ట్రాఫిక్‌కు అక్కడ విధుల్లో ఉన్న శివాజీని రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న జీ రాజేశ్వరరావును కావలి రూరల్ పోలీసు స్టేషన్‌కు, అక్కడ విధుల్లో ఉన్న కే శ్రీనివాసరావును రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు. బదిలీ అయిన వారు వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు.




నెల్లూరు : రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతం

హరివల్లభే భక్తవరదే !

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం
ఇంటింటా లక్ష్మీపూజ
భక్తులతో ఆలయాలు కళకళ

నెల్లూరు (సాంస్కృతికం) : శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాన్ని జిల్లా వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇంటింటా కలిశాలు ఏర్పాటు చేసి లక్ష్మీదేవిని ఆవాహన చేశారు. తోరము ధరించి వాయనాలిచ్చి ముత్తైదువుల ఆశీస్సులు అందుకున్నారు. ఆలయాల్లో సామూహికంగా వరలక్ష్మీ వ్రతాన్ని, లక్ష కుంకుమార్చన జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. పలుచోట్ల అన్న ప్రసాద వితరణ జరిగింది. నెల్లూరులోని రాజరాజేశ్వరి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం వైభవంగా జరిగింది. మూల వర్లకు విశేష అభిషేకాలు, నవావరణ పూజలు, పూలంగి సేవ జరిగాయి. అనివెట్టి మండపంలో రాజరాజేశ్వరి అమ్మవారి ఉత్సవమూర్తి వరలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ ప్రధాన అర్చకుడు రఘునాథశర్మ, వేదపండితుడు రామకృష్ణ భక్తులతో వ్రతం చేయించారు. ఈ సంద ర్భంగా చండీ హోమం నిర్వహిం చారు. సాయంత్రం విశేష పల్లకీసేవ, కుంభహారతులు జరిగాయి. ఆలయం చైర్మన్ రత్నం జయరామ్, ఈవో సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య పర్యవేక్షించారు.



రాపూరు : పెంచలకోనలో ఆదిలక్ష్మి అమ్మవారు..



కావలి : బృందావనం కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో..



వడ్డీపాళెం సెంటర్‌లో బైఠాయించిన నారాయణ వైద్యులు, మెడికోలు

కోల్‌కతా ఘటన

గర్జించిన వైద్యలోకం

- జిల్లావ్యాప్తంగా వైద్యులు, సిబ్బంది నిరసనలు
- నిందితులపై కఠినంగా వ్యవహరించాలి
- సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 16 : కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాలలో శిక్షణ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరశిస్తూ శుక్రవారం జిల్లావ్యాప్తంగా వైద్యులు, సిబ్బంది, మెడికోలు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు చేతబట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేస్తూ ప్రదర్శనలు చేపట్టారు. సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేసి మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నెల్లూరులోని ప్రభుత్వం వైద్య కళాశాల వైద్యులు, మెడికోలు వైద్య విద్య కళాశాల నుంచి మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా జీజీహెచ్‌లో ఓపీ సేవలు నిలిపి వేశారు. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జునాయిద్ ఆల్ అహ్మద్, జోయల్, హితేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. శనివారం కూడా ఆసుపత్రిలో ఓపీ సేవలు నిలిపి వేస్తామని వైద్యులు వెల్లడించారు. అలాగే నారాయణ వైద్య కళాశాలలోనూ వైద్యులు, మెడికోలు ఆందోళన చేపట్టారు. కళాశాల నుంచి వడ్డీపాళెం వరకు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ రాత్రింబవళ్లు సేవలు అందించే వైద్యులపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణ వైద్య కళాశాల, డెంటల్ కళాశాల వైద్యులు, మెడికోలు, నారాయణ ఆసుపత్రి ఏజీఎం శేఖర్‌రెడ్డి, ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



జీజీహెచ్ ప్రాంగణంలో ప్రభుత్వ వైద్య విద్య కళాశాల వైద్యులు, మెడికోలు

నేడు ఓపీ సేవలు నిలిపివేత

కోల్‌కతాలో జరిగిన ఘటనపై జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ ఆసుపత్రులలో శనివారం ఓపీ సేవలు నిలిపి వేస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎంసీఎస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియచేశారు. అత్యవసర వైద్యసేవల్లో మాత్రమే పాల్గొంటామని తెలియచేశారు. వైద్యురాలిపై జరిగిన ఘటనపై సీబీఐ ఆధ్వర్యంలో నేరపరిశోధన త్వరితగతిన చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బందికి తగిన రక్షణ కల్పించేందుకు కేంద్రస్థాయిలో ప్రత్యేక చట్టాలు తీసుకు రావాలని కోరారు.

నేడు ఉపరాష్ట్రపతి రాక

- పర్యటనలో స్వల్ప మార్పు : కలెక్టర్



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 16 : భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ శనివారం జిల్లా పర్యటనకు వస్తున్నారని, ఆయన పర్యటనలో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయని కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8.35గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బయలు దేరి 9.50 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారని తెలిపారు. అక్కడ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలు దేరి 10.30 గంటలకు నెల్లూరులోని పోలీసు పెరేడ్ గ్రౌండ్‌కు చేరుకుంటారని తెలిపారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా 10.50 గంటలకు వెంకటాచలంలోని అక్షర విద్యాలయానికి చేరుకుని అక్షర విద్యాలయం, స్వర్ణభారత్ ట్రస్టులో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 1.20 గంటలకు పోలీస్ పరేడ్ మైదానం నుంచి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా రేణిగుంట విమానాశ్రయానికి వెళతారని తెలిపారు.

అప్రమత్తంగా ఉండండి : ఎస్పీ

నెల్లూరు (క్రైం) : ఉపరాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్ పర్యటన సందర్భంగా పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. శుక్రవారం పోలీసు పెరేడ్ మైదానంలో పోలీసులతో ఆయన మాట్లాడుతూ అందరూ సమన్వయం పాటిస్తూ కేటాయించిన విధుల్లో పాల్గొనాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నెల్లూరుకు చేరుకున్న గవర్నర్

వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టు వార్షికోత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు శుక్రవారం రాత్రి నెల్లూరుకు చేరుకున్నారు. విజయవాడ నుంచి రైలులో వచ్చిన వారికి రైల్వేస్టేషన్‌లో కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, జేసీ కార్తీక్, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, ఆర్డీఓ మలోల ఘన స్వాగతం పలికారు. శనివారం ఉదయం వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్ట్ వార్షికోత్సవ వేడుకల్లో గవర్నర్ దంపతులు పాల్గొంటారు.

385 మందికి కృత్రిమ అవయవాలు

- మూడు రోజులపాటు శిబిరం నిర్వహణ



శిబిరానికి తరలివచ్చిన వారిని పలకరిస్తున్న వెంకయ్యనాయుడు, పక్కన మంత్రి ఆనం

వెంకటాచలం, ఆగస్టు 16 : వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో శుక్రవారం స్వర్ణభారత్ ట్రస్ట్, భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయ సమితి (హైదరాబాద్) సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృత్రిమ అవయవాల ఉచిత అమరిక శిబిరాన్ని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రారంభించారు. శిబిరంలో ఆపన్నులను వారు ఆప్యాయంగా పలకరించారు. తొలిరోజు 385 మంది లబ్ధిదారులు శిబిరానికి విచ్చేసి తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోగా, అక్కడున్న సిబ్బంది వారందరి కొలతలు తీసుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారందరికీ భోజనం, వసతి ఏర్పాట్లు చేశారు. స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ పర్యవేక్షణలో లబ్ధిదారులకు వీల్‌చైర్లు, వాకర్లు, క్రచెస్‌ను పంపిణీ చేశారు. ఈ శిబిరం మూడు రోజులపాటు సాగుతుందని స్వర్ణభారత్ ట్రస్ట్ సమన్వయకర్త జనార్ధన్‌రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ అట్లూరి అశోక్, భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయసమితి కార్యదర్శి ఇంద్రకుమార్‌జైన్, ప్రదీప్‌జైన్ పాల్గొన్నారు.

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది. ఆ సత్యాన్ని గుర్తించిన తెలుగుదేశం ప్రభుత్వం పట్టణ పేదల ఆకలి తీర్చడం కోసం 2014-19 మధ్య అన్నా క్యాంటీన్లు తెరిచింది. ప్రజాస్వామ్య విలువలను, ప్రతిపక్షాల ఉనికిని ఏమాత్రం లెక్కచేయని, సహించని మనస్తత్వం కలిగిన వైసీపీ అధినాయకత్వం నిర్దయగా ఆ క్యాంటీన్లను మూసివేసింది. పేదల ఆకలి పట్టని పాలకులను గడిచిన ఎన్నికల్లో ప్రజలు సాగనంపారు. సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు అని నినదించే తెలుగుదేశం పార్టీకి తిరిగి పట్టం కట్టారు. ప్రజలు ఇచ్చిన ఈ తీర్పుతో తిరిగి పేదల ఆకలి తీరే మార్గం దొరికింది. బతుకుదెరువు కోసం పొట్ట చేతపట్టుకొని పట్టణాలకు వచ్చే పేదల కోసం మళ్లీ అట్టహాసంగా అన్నా క్యాంటీన్లు శుక్రవారం ప్రారంభమయ్యాయి.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)



ఆకలి తీరింది!

- జిల్లావ్యాప్తంగా అన్న క్యాంటీన్ల ప్రారంభం
- నెల్లూరులో 7, కావలి, కందుకూరులో ఒక్కొక్కటి
- రూ.5లకే కడుపు నింపుకున్న పేదలు

నెల్లూరు నగరాన్ని ఆసరా చేసుకొని కొన్ని వేల పేద కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఎంత శ్రమించినా దొరికే కూలి అంతంత మాత్రమే. బస్సు, ఆటోల చార్జీలు, టిఫిన్, భోజనాలకు సగం కూలి ఖర్చయిపోతుంది. కొందరు తింటున్నా.. మరికొందరు ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఆకలితో ఉండిపోతున్నారు. ఇది గుర్తించిన తెలుగుదేశం ప్రభుత్వం 2014-19 మధ్య కాలంలో పట్టణాల్లో అన్న క్యాంటీన్లను తెరిచింది. అతి తక్కువ ధరకు భోజనం అందించారు. అయితే ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం క్యాంటీన్లను మూసివేసింది. దీంతో ఐదేళ్లపాటు పేదజనం అర్ధాకలితోనే బతికారు. ఎట్టకేలకు ఇప్పుడు కూటమి ప్రభుత్వం మళ్లీ పేదల ఆకలి తీర్చేందుకు కంకణం కట్టుకుంది. శుక్రవారం రోజు జిల్లావ్యాప్తంగా తొమ్మిది అన్న క్యాంటీన్లను ప్రారంభించింది.

అట్టహాసంగా ప్రారంభం

నెల్లూరు నగరంలో ఏడు, కావలి, కందుకూరులలో ఒక్కొక్కటి చొప్పున అన్న క్యాంటీన్లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం నెల్లూరులో రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలతోపాటు కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, కమిషనర్ సూర్యతేజ తదితరులు వివిధ ప్రాంతాల్లో క్యాంటీన్లను ప్రారంభించారు. ఇక కావలిలో ఎమ్మెల్యే కావ్యకృష్ణారెడ్డి, కందుకూరులో ఇంటూరి నాగేశ్వరరావు క్యాంటీన్లను ప్రారంభించి, స్వయంగా పేదలకు వడ్డించారు.

విరాళాల వెల్లువ

కందుకూరు : అన్న క్యాంటీన్ల నిర్వహణ కోసం పలువురు దాతలు తొలిరోజే భారీగా విరాళాలు అందజేశారు. కందుకూరులో టీడీపీ నాయకుడు పిడికిటి వెంకటేశ్వర్లు రూ.55555, తానికొండ ప్రవీణ్ రూ.50వేలు, కాకుమాని ప్రవీణ్ రూ.25వేలు, ఎర్రారెడ్డిపాలెం గ్రామ నాయకుడు రాజవరపు మాలకొండయ్య రూ.25,116, కొత్త వెంకటేశ్వర్లు, కొత్తూరు వెంకట సుధాకర్, గుర్రం వెంకటేశ్వర్లు, సుదర్శి శ్యాంప్రసాద్, షేక్ నజీర్ బాషా తలా పదివేల రూపాయలు వంతున ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావుకు అందజేశారు. అలాగే మోదడుగు లక్ష్మణ్‌కుమార్ రూ.5116, చాకిచర్ల గ్రామనాయకుడు మిరియం మల్లిఖార్జున రూ.5500, ముచ్చు రామకోటయ్య రూ.5116, చల్లా మీనాక్షి రూ.5వేలు, మరికొందరు దాతలు తలా రూ.వెయ్యి చొప్పున అందించారు.

- కావలి : పట్టణంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో నడిచే అన్న క్యాంటీన్ కోసం కావలి అభయం స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష రూపాయల విరాళం చెక్కును ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి అందించారు.
- నెల్లూరు రూరల్ : రామలింగాపురం వద్దనున్న అన్న క్యాంటీన్‌కు గోశాల సురేంద్రరెడ్డి రూ.5 వేలు అందచేశారు.



కావలిలో రూ.లక్ష విరాళం చెక్కును ఎమ్మెల్యేకు ఇస్తున్న అభయం స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు

రోజుకు రూ.15లే!

ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఖర్చు కేవలం రూ.15లే. పూటకు ఐదు రూపాయల వంతున క్యాంటీన్లలో వసూలు చేస్తున్నారు. ఉదయం మూడు ఇడ్లీలు, లేదా మూడు పూరీలు, మధ్యాహ్నం అన్నం, పప్పు, సాంబార్, పెరుగు, పచ్చడి వడ్డిస్తారు. ఐదేళ్ల తరువాత తమ ఆకలి తీర్చడం కోసం అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించడం పట్ల పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నారు.



నెల్లూరు : ఫిష్ మార్కెట్ వద్ద మంత్రి నారాయణ, టీడీపీ నేతలు అజీజ్, కోటంరెడ్డి తదితరులు



అన్న క్యాంటీన్‌లో కలెక్టర్‌తో కలిసి టిఫిన్ చేస్తున్న మంత్రి ఆనం



నెల్లూరు : స్టోన్‌హౌస్‌పేటలోని క్యాంటీన్ వద్ద క్యూలో జనం

ఈ నిర్ణయం అద్భుతం!



పెద్దోళ్ల సంగతే మోకానీ మాలాంటి చిరు వ్యాపారులకు ఈ అన్న క్యాంటీన్లు చాలా ఉపయోగ పడతాయి. ఈ రోజుల్లో రూ.5లకు ఏం వస్తుంది చెప్పండి. టీనీళ్లు కూడా రావడం లేదు. అలాంటిది కడుపునిండా అన్నం దొరుకు తుందంటే ఆశ్చర్యమే. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అద్భుతం. పేదవాళ్లకి కడుపు నిండిందంటే చాలా కష్టాలు తీరినట్టే.

- వెంకటరమణయ్య, పూలవ్యాపారి, నెల్లూరు

ఇక ఆకలి బాధుండదు!



నిద్రలేచినప్పటినుంచి బతుకు దెరువు కోసం పరుగులు తీసే మాలాంటి కార్మికులం వేళకు భోజనం లేక, వందలు ఖర్చు చేసి హోటల్లో భోజనం చేసే స్తోమత లేక అర్ధాకలితో అలమటిస్తు న్నాం. అన్నా క్యాంటీన్ ప్రారంభంతో మా ఆనందాన్ని మాటల్లో వర్ణించలే కున్నాం. ఉదయం కేవలం ఐదు రూపాయలకే పొంగలి, రెండు ఇడ్లీ, ఒక పూరీ పెట్టారు. ఇడ్లీలు కూడా పెద్దవిగా ఉండటంతో కడుపు నిండిపోయింది. మధ్యాహ్నం అన్నం కూడా ఇక్కడే చేశాను. వేళకు తిండి గురించి ఆలోచించాల్సిన అవసరం లేనందున మరో ఐదారు వందలు అదనంగా సంపాదించుకోగలుగుతాం.

- కొచ్చర్ల మాల్యాద్రి, ఆటో డ్రైవరు, కందుకూరు

నేత్రపర్వంగా రంగడి ప్రాకారోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 16 : తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం తిరుమంజనం, హోమాలు, పవిత్ర ప్రతిష్ఠ పూజలు జరిగాయి. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి ప్రాకారోత్సవం కన్నుల పండు వగా జరిగింది. ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

ప్రభగిరిపట్నం సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

పొదలకూరు, ఆగస్టు 16 : గ్రామ పంచాయతీ నిధులను పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేయకుండా, ఖర్చు చేసినట్లు రికార్డుల్లో చూపించి అవినీతికి పాల్పడిన మండ లంలోని ప్రభగిరిపట్నం గ్రామ సర్పంచ్ పిల్లిపాక వెంకమ్మ చెక్‌పవర్ రద్దుచేస్తూ జిల్లా పంచాయతీ అధికారి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. నిధులు డ్రాచేసే అధి కారాన్ని తాత్కాలికంగా మూడునెలల పాటు నిలుపుదల చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రూ.7,33,873 గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం అయినట్లు విచా రణలో ప్రాథమికంగా తేలిందని, 15 రోజుల్లోగా జమ చేయాలని, లేనట్లయితే క్రమశిక్షణ చర్యలు తప్పవని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సోమశిల జలాశయంలో అక్రమవేట



జలాశయంలో వేట సాగిస్తున్న జాలర్లు



నిందితుడి అదుపులోకి తీసుకుని చేపలను స్వాధీనం చేసుకున్న ఎస్ఐ సుబ్బారావు

అనంతసాగ రం, ఆగస్టు 16: సోమశిల జలాశయంలో ఈ నెల చివరి వరకు చేపల వేట నిషేధం ఉన్నా కొందరు జాలర్లు యథేచ్ఛగా చేపల వేట కొనసాగిస్తున్నారు. జూలై, ఆగ స్టు మాసాల్లో చేప గుడ్డు దశలో ఉంటుంది. ఈ సమయంలో వేట కొనసాగిస్తే చేపల ఉత్పత్తి తగ్గే ప్రమాదం ఉందని ప్రభుత్వం రెండు నెలలపాటు వేట నిషేధం ప్రకటించింది. అయితే కొందరు జాలర్లు, వ్యాపా రులు కుమ్మక్కై రహస్యంగా చేపల పడుతూ అక్రమ సంపదనకు అలవాటు పడ్డారు. బహి రంగా లోతట్టుకు వెళ్లి వేట సాగిస్తున్న పరిస్థితి ఉంది. మత్స్యశాఖ అధికారులు చర్యలు కరు వైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో శుక్రవారం సోమశిల ఎస్ఐ సుబ్బారావు జలాశయలో చేపలు పట్టి బయటకు తెస్తున్న జాలరీని అదుపులోకి తీసుకున్నారు. అయినా కొందరు వేటసాగిస్తు కనిపించడం గమనార్హం. అక్రమ వేట జరుగకుండా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సోమశిలలో 21.886 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, ఆగస్టు 16: సోమశిల జలాశయా నికి ఎగువ నుంచి శుక్రవారానికి 12,456 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాం పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 21.886 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

అనుమతులు లేకుండా మట్టి తరలింపు



ఇటుక బట్టీలకు ట్రాక్టర్‌తో మట్టి తరలిస్తున్న దృశ్యం

సంగం, ఆగస్టు 16: అన్నారెడ్డిపాళెం మజరా గ్రామం పల్లిపాలెం నుంచి కొందరు ఇటుక వ్యాపారులు అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. అనుమతులు లేకుండా పొలాల ల్లోని దిబ్బలను ఎక్స్‌కవేటర్‌తో తవ్వి ట్రాక్టర్ల ద్వారా బుచ్చిరెడ్డిపాళెంకు తరలిస్తున్నారు. రెవెన్యూ, పోలీస్, సెబ్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు మండిపడి తున్నారు. ట్రాక్టర్ మట్టి రూ.రెండు వేల నుంచి రూ.రెండున్నర వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

మర్రిపాడు సమీపంలో మృతదేహం గుర్తింపు

- హత్యగా భావిస్తున్న పోలీసులు



రోడ్డు సమీపంలో పడి ఉన్న మృతదేహం

మర్రిపాడు, ఆగస్టు 16: నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిలోని బద్వేలు వైపు మర్రిపాడుకు 2కిలోమీటర్ల దూరంలో శుక్రవారం ఉదయం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. స్థానికులు ఈ విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ విశ్వనాథ్‌రెడ్డి అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పరిసర ప్రాంతంలో ప్రమాదానికి గల ఆనవాలు ఏమీ కనిపించక పోవడంతో ఎక్కడో హత్యచేసి మృతదేహాన్ని ఇక్కడ వదిలేసి వెళ్లినట్లు భావిస్తూ ఆ కోణంలో విచారిస్తున్నారు. మృతుడి ఎడమకాలుకు కృత్రిమ రబ్బరు కాలు అమర్చి ఉన్నట్లు తెలిపారు. మృతుడు ముస్లింగా భావిస్తూ, 37ఏళ్ల వయసు ఉండొచ్చని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తలించారు.

పోలయ్యది సహజ మరణమే

ఉదయగిరి రూరల్, ఆగస్టు 16: శకునాలపల్లి గ్రామ క్వారీ సమీపంలో మృతిచెందిన మేకల పోలయ్యది సహజ మరణమేనని ఉదయగిరి పోలీసుల విచారణలో తేలినట్లు కావలి డీఎస్పీ ఎం.వెంకటరమణ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీతారామపురం మండలం వేంపల్లితోక ఎస్టీ కాలనీకి చెందిన ఈయన మృతదేహాన్ని రెండు రోజుల క్రితం పశువులు వెతికేందుకు వెళ్లిన స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు తెలిపారు. వారు అక్కడకు వెళ్లి పరిశీలించి మృతదేహం బాగా కుళ్లిపోయి తరలించేందుకు వీలులేకుండా ఉండడంతో అక్కడే కాల్చివేశారన్నారు. పోలీసుల విచారణలో సైతం పోలయ్య మృతదేహాన్ని తామే కాల్చివేశామని, అతని మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని అంగీకరించారని ధ్రువీకరించారు.

విద్యుదాఘాతంతో పూరిల్లు దహనం

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 16: మండలంలోని నాగమాంబాపురంలోని రామాలయం సమీపంలో షేక్ బీమాబీ అనే వృద్ధురాలికి చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గురువారం అర్ధరాత్రి దహనమైంది. ప్రమాదంలో గృహోపకరణాలు, రూ.20వేల నగదు తదితర పత్రాలు కాలి బూడిదయ్యాయి. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సమాచారం అందుకుని పుట్టా సుబ్రహ్మణ్యం ద్వారా బాధితులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారని టీడీపీ నాయకుడు గిరి తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	112
లేయర్ లైవ్	100
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	230
లేయర్	170

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6782
వెండి కిలో ధర	రూ. 84,100
వెండి ఒక గ్రాము	రూ. 87.10

గురుకుల కళాశాలలో తాత్కాలిక టీచర్ల భర్తీకి 21న డెమో

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 16 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికను టీచర్ పోస్టుల భర్తీకి ఈనెల 21న డెమో తరగతులు నిర్వహిస్తున్నామని గురుకుల విద్యాసంస్థ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ జయలక్ష్మి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టీజీటీ ఇంగ్లీష్, ఫిజికల్ సైన్సు, మాథ్స్, సబ్జెక్టులను బోధించడానికి టీచర్ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, బీఈడీలో ఒక మెథడాలజీ కలిగి, టెట్ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలి పారు. ఆసక్తి గల వారు ఈనెల 21వ తేదీ ఉదయం 11 గంటలకు విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికెట్లు, టెట్, కులధ్రువీ కరణ సర్టిఫికెట్లతో తమ కార్యాలయంలో డెమోకు హాజరు కావాలని కోరారు.

హా... స్టళ్లు!

సంక్షేమ వసతి గృహాలు మూత

- 8చోట్ల విద్యార్థులు నిల్
- నిర్లక్ష్యంగా సంక్షేమాధికారులు
- జిల్లా అధికారుల తనిఖీలు కరువు



నెల్లూరులోని సాంఘిక సంక్షేమ వసతి గృహం

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 16 : పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల విద్యా, విద్యావసతుల కోసం జిల్లాలో ఏర్పాటు చేసిన సంక్షేమ హాస్టళ్లు మూతబడిపోతున్నాయి. ఈ హాస్టళ్లలో విద్యార్థులను చేర్పించి, వారికి వసతులు కల్పించాల్సిన హాస్టల్ వెల్ఫేర్ అధికారులు కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ హాస్టళ్ల మూతపడటానికి కారణమవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా అధికారులు పట్టించుకోకపోవటంతో కొందరు హాస్టల్ వెల్ఫేర్ అధికారులు విద్యార్థులు లేకపోయినా బిల్లులు చేసుకుంటున్నారనే విమర్శలున్నాయి.

సాధారణంగా ఉదయం పూట విద్యార్థులకు హాస్టల్‌లో మెనూ ప్రకారం అల్పాహారం పెట్టిన తరువాత పాఠశాలకు పంపాలి. పాఠశాలలు వదిలి సాయంత్రానికి విద్యార్థులు హాస్టల్‌కు చేరిన తరువాత వారి భోజనం, విద్య, చదువు గురించి పట్టించుకోవాలి. విద్యార్థులు రాత్రి పూట హాస్టల్‌లోనే ఉండాలి. కానీ కొందరు వార్డన్లు పట్టించుకోకపోవటంతో హాస్టల్ విద్యార్థులు ఇళ్లకు వెళుతున్నారు. హెచ్‌డబ్ల్యు వోలు నెలకోసారి హాస్టల్ విద్యార్థులు చదువుతున్న పాఠశాలకు వెళ్లి వారి చదువు గురించి తెలుసుకోవాలి. కొత్త విద్యార్థులు హాస్టళ్లలో చేరేలా చూడాలి. హాస్టల్ ఉండే ప్రాంతంలోనే హెచ్‌డబ్ల్యూవోలు నివాసం ఉండాలి. కానీ వారు నగరాల్లో, పట్టణాల్లో ఉంటూ హాస్టళ్ల పర్యవేక్షణను గాలికొదిలేస్తున్నారు. ఇక, ఇన్‌చార్జులు ఉన్నచోట అయితే పరిస్థితులు మరింత అధ్వానంగా ఉన్నాయి.

మూతపడుతున్నాయి

జిల్లాలో 71 సాంఘిక సంక్షేమ ఎస్సీ హాస్టళ్లు ఉన్నాయి. టీపీ గూడూరు, సర్వేపల్లిలో ఉన్న రెండు హాస్టళ్లు మూతపడ్డాయి. అధికారుల చొరవ లేకపోవడమే ఇందుకు కారణమనే ఆరోపణలున్నాయి. జిల్లాలో వెనుకబడిన తరుగతుల విద్యార్థుల కోసం 79 హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో ప్రీప్రైమరీ హాస్టళ్లు 63. పోస్టు మెట్రిక్ హాస్టళ్లు 16 ఉన్నాయి. ప్రీప్రైమరీ హాస్టళ్లలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉంది. వాటిలో 3377 మంది విద్యార్థులు ఉన్నారు. పోస్టు మెట్రిక్ హాస్టళ్లలో 1096 మంది ఉన్నారు. ఈ రెండు రకాల హాస్టళ్లకు సంబంధించి ఎనిమిది చోట్ల ఈ ఏడాది ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. ఆత్మకూరు, నెల్లూరు, కావలి, కందుకూరు డివిజన్లలోని బీసీ హాస్టళ్లలో రెండేళ్ల సున్నా ప్రవేశాలే ఉండటం గమనార్హం. బుచ్చిరెడ్డిపాళెం బీసీ వసతి గృహంలో 31 మంది విద్యార్థులకు అవకాశం ఉండగా ఒక్కరు కూడా చేరలేదు. రామాయపట్నంలో 93 మంది, ముత్తుకూరులో 30 మంది, చేజర్లలో 31 మంది, చెముడుగుంటలో 24 మంది, కామిరెడ్డిపాడులో 21 మంది, కలువాయి హాస్టల్‌లో 30 మంది విద్యార్థులు చేరాల్సి ఉండగా వాటిలోనూ ఎవరూ చేరలేదు. అయితే, హాస్టళ్లలో విద్యార్థులు చేరకపోవటంపై జిల్లా అధికారులు దృష్టి సారించటం లేదనే విమర్శలు ఉన్నాయి.

షోకాజ్ నోటీసులు ఇచ్చాం



జిల్లాలో మూతపడ్డ హాస్టళ్ల విషయమై సంబంధిత హాస్టల్ వెల్ఫేర్ అధికారులకు షోకాజ్ నోటీసులు ఇచ్చాం. హాస్టళ్లలో తనిఖీలు పెంచుతాం. వసతిగృహాల్లో విద్యార్థులు చేరేలా అన్ని చర్యలు తీసుకుంటాం.

\- వెంకటయ్య, జిల్లా బీసీ సంక్షమాధికారి, సోషల్ వెల్ఫేర్ ఇన్‌చార్జి డీడీ

రివర్ ఫ్రంట్‌తో ఆహ్లాదం

- ప్రణాళికాబద్ధంగా నెల్లూరు నగరాభివృద్ధి
- మంత్రులు నారాయణ, ఆనం



పెన్నానదిని పరిశీలిస్తున్న మంత్రులు ఆనం, నారాయణ

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 16 : పెన్నా రివర్ ఫ్రంట్ ద్వారా నదీ పరీవాహక ప్రాంతాలను సమగ్రాభివృద్ధి చేసి సింహపురి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించటమే లక్ష్యంగా మంత్రి పొంగూరు నారాయణ అడుగులు వేస్తున్నారని రాష్ట్ర దేవదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. నెల్లూరు నగరంలోని పెన్నా బ్యారేజీ, తిక్కన పార్కు, పినాకినీ పార్కు తదితర ప్రాంతాలను మంత్రులు ఆనం, నారాయణ శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. పార్కులలో వ్యాయామ పరికరాలు తుప్పు పట్టి ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. సమీపంలోని ఫుట్‌బాల్ కోర్టును పరిశీలించారు. దానిని అభివృద్ధి చేయాలని నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. పెన్నా బ్యారేజీని సందర్శించి, నదిలో పేరుకుపోయిన గుర్రపుడెక్కాకు, నాచును తొలగించటంపై అధికారులకు సూచనలు చేశారు. స్థానికులతో ముచ్చటించారు. వారు తెలియచేసిన సమస్యలను పరిష్కరించేదిశగా అధికారులను ఆదేశాలిచ్చారు. మంత్రి నారాయణ ట్యాబ్ ద్వారా రివర్‌ఫ్రంట్ అభివృద్ధి ప్రణాళికను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ నెల్లూరు బ్యారేజీ నుంచి పాత మున్సిపల్ ఆఫీసు వెనుక ఉన్న పొట్టేపాళెం రోడ్డు వరకు రివర్ ఫ్రంట్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రోడ్డు సైడ్ పార్కులు, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేస్తే నగరవాసులు సాయం సమయంలో కొంతసేపు సేదతీరేందుకు అనువుగా ఉంటుందనేది మంత్రి నారాయణ ఆలోచనగా చెప్పారు. బ్యారేజీ నుంచి పుత్తా ఎస్టేట్ వరకు దాదాపు ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ సూర్యతేజ, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం

- సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు హేమలత



నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ శ్రేణులు



మాట్లాడుతున్న హేమలత

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 16 : కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించ కపోతే ఉద్యమిస్తామని సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు హేమలత హెచ్చరించారు. సీఐటీయూ రాష్ట్రస్థాయి సమావేశాల సందర్భంగా శుక్రవారం నెల్లూరు నగరంలో ప్రదర్శన నిర్వహించారు. ఏబీఎం ప్రాంగణం నుంచి గాంధీబొమ్మ మీదుగా ఏసీసుబ్బారెడ్డి బొమ్మ వరకు ప్రదర్శన సాగింది. నర్తకి సెంటర్ వద్ద బహిరంగ సభలు ప్రారంభ మయ్యాయి. హేమలత మాట్లాడుతూ మోదీ పాలన పదేళ్లలో అనేక కార్మిక చట్టాలను సవరించటం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు అయినా కార్మికులకు సంబంధించిన ఒక్క అంశాన్నీ ప్రకటించలేదని విమర్శించారు. కృష్ణపట్నం పోర్టు సమస్యలను పరిష్క రించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నర్సింగరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేతలు సుబ్బరామమ్మ, ధనలక్ష్మి, ఉమామహేశ్వరరావు, జల్లా అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణకు బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలి

- అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 16 : క్షయ నివా రణకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. శుక్రవారం నెల్లూరు నగరంలోని భగత్‌సింగ్ కాలనీ, జేఎస్ కాలనీ పరిధిలో వృద్ధులకు బీసీజీ వ్యాక్సిన్ పంపిణీ తీరును ఆయన పరిశీలించారు. ఆయా పీహెచ్‌సీలలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షయ నివారణకు ప్రభుత్వం అందిస్తున్న టీకాను వృద్ధులు, క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు తప్పనిసరిగా వేయాలన్నారు. క్షయ వ్యాధి గుర్తింపు పరీక్షలపై ఆరోగ్య కేంద్రాల సిబ్బందిని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌టీబీ కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, టీబీ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ వేణుగోపాల్, హిమధర్ తదితరులు పాల్గొన్నారు.



బీసీజీ వ్యాక్సిన్ వేసే తీరును పరిశీలిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలీ

మేం కదలం..!

- కార్పొరేషన్‌లో ఏళ్లతరబడి పాతుకుపోయిన ఇంజనీర్లు
- రాజకీయ అండతో కుర్చీలు పదిలం
- పనుల్లో నాణ్యత లేకపోయినా బిల్లు పాసు
- మితిమీరిన పర్సెంటేజీల వసూళ్లు

నెల్లూరు(సిటీ), ఆగస్టు 16 : నెల్లూరు నగర పాలక సంస్థలో కీలకమైన విభాగాల్లో ఇంజనీరింగ్ విభాగం ఒకటి. నగరంలో రోడ్లు, కల్వర్టులు, డ్రైన్లు, కాలువల్లో పూడికతీత, డంపింగ్ యార్డుల్లో చెత్త తరలింపు, దోమల నివారణకు చర్యలు, పారిశుధ్య కార్మికులకు సామగ్రి కొనుగోళ్లు, పారిశుధ్య పనిముట్ల సమీకరణ వంటి వ్యవహారాలన్నీ పర్యవేక్షించేది ఆ విభాగంలోని ఇంజనీర్లే. నాణ్యత, ప్రమాణాలతో కూడిన సేవలు అందించాల్సిన ఆ విభాగం అధికారుల్లో కొందరు అవినీతిని అలవాటుగా మార్చుకోవడమేకాక ఏళ్ల తరబడి ఒకే స్థానంలో పాతుకుపోయారు. మితిమీరిన రాజకీయ జోక్యం, హద్దులు దాటిన పర్సెంటేజీల వసూళ్లు, క్వాలిటీ కంట్రోల్‌తో సంబంధం లేకుండానే బిల్లులు పాసు చేయడం, ప్రజాప్రతినిధులకు ఊడిగం చేయడమే విధి నిర్వహణగా భావిస్తూ ప్రభుత్వాలు మారినా వీరుమాత్రం కుర్చీలను కాపాడుకుంటున్నారు.



ఇంజనీరింగ్ విభాగంలో ఇద్దరు ఈఈ లు, ముగ్గురు డీఈఈలు, నలుగురు ఏఈఈలు ఐదేళ్లకు పైబడి నెల్లూరులోనే పాతుకుపోయి పని చేస్తున్నారు. నగరంలోని మొత్తం 54 డివిజన్లలో సుమారు 45 డివి జన్లపై వీరే పెత్తనం సాగిస్తున్నారు. సీసీరోడ్లు, కల్వర్టులు, డ్రైన్లను ప్రజల అవసరాలకు అనుగుణంగా కాకుండా స్థానిక రాజకీయ నాయకుల లబ్ధికోసమేనంటూ ప్రతిపాద నలు తయారు చేస్తారన్న విమర్శలున్నాయి. చెత్త తరలింపునకు వినియోగిస్తున్న ప్రైవేటు ట్రాక్టర్లకు రోజుకు రూ.2,400 చొప్పున కార్పొరేషన్ చెల్లిస్తుండగా అందులో రూ.400ను సదరు ఇంజనీర్లు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు పాసు చేసేందుకు ఏకంగా 16 శాతం లంచాన్ని కాంట్రాక్టర్ల వద్ద వసూలు చేస్తున్నారని, నాణ్యతను పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. అలాగే పారిశుధ్య విభాగానికి అవసరమైన సామగ్రి కొనుగోళ్లు, యంత్రాల మరమ్మతులు, వాహనాల డీజిల్ పేరిట అంతులేని అవినీతికి పాల్పడుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల్లోనూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.

ఆ సారు రాత్రుళ్లే వస్తారు!

ఇంజనీరింగ్‌లోని ఓ ఉన్నతాధికారి రూటే వేరు. ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లకు తప్ప మరెవ్వరికి ఆయన అందుబాటులో ఉండరు. కనీసం ఫోను కూడా తీయరు. గత కమిషనర్ వికాస్ స్వయంగా ఫోను చేసినా సమాధానం చెప్పని సందర్భాలెన్నో. పగటి పూట కార్యాలయానికి అప్పుడప్పుడు వచ్చే ఈ అధికారి బయటి నుంచే పాలన వ్యవహారాలు నడుపుతుంటారు. రాత్రి పూట మాత్రమే ఆఫీసుకు వస్తారు. సాయంత్రం 7 నుంచి 9 గంటల వరకు కార్యాలయంలో అందుబాటులో ఉండి కాంట్రాక్టర్లకు దర్శనమిచ్చి పర్సెంటేజీలు మాట్లాడుకుని వెళ్లిపోతారు. ఈయనపై ఇప్పటికే ఏసీబీ కేసులన్నప్పటికీ అవినీతిలో మాత్రం వెనుకడుగు వేయడం లేదు.

అంగన్‌వాడీలకు ఆగిన కందిపప్పు

- రెండు నెలలుగా సరఫరా నిలిపివేత



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం తింటున్న చిన్నారులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 16 : అంగన్‌వాడీ కేంద్రాలకు రెండు నెలలుగా కందిపప్పు సరఫరా నిలిచిపోయింది. జిల్లాలో 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,934 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాలకు ప్రతినెలా ప్రభుత్వం బియ్యం, కందిపప్పు, నూనె సరఫరా చేస్తుంది. ఈ వస్తువులతో కేంద్రంలో కార్యకర్తలు భోజనం వండి చిన్నారులకు వడ్డించాలి. టేక్‌హోం రేషన్ కింద గర్భవతులు, బాలింతలకు ప్రతి నెలా కేజీ కందిపప్పు అందజేయాలి. అయితే జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి కందిపప్పు సరఫరా కాకపోవడంతో కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల తమ సొంత ఖర్చులతో కందిపప్పు కొనుగోలు చేస్తున్నారు. ప్రతిరోజు కందిపప్పుతో వంటకం ఉంటుందని, పప్పు సరఫరా చేయకపోతే తామెలా కూరలు వండాలని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కందిపప్పు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. కాగా, ఈ విషయమై ఐసీడీఎస్ పీడీ హేనాసుజన మాట్లాడుతూ కందిపప్పు సరఫరా ఆగిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. త్వరలోనే పంపిణీకి చర్యలు చేపడతామని వెల్లడించారు.

15 శాతం వృద్ధి రేటు సాధించాలి

- వికసిత్ ఆంధ్ర-2047 ప్లాన్ సమావేశంలో కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 16 : జిల్లాలోని ప్రతి ప్రభుత్వ శాఖలో రాబోయే ఐదేళ్లలో 15 శాతం వృద్ధి రేటు సాధించడానికి అధికారులందరూ ప్రత్యేక కార్యాచ రణతో పనిచేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని తిక్కన భవన్‌లో వికసిత్ ఆంధ్ర-2047 ప్లాన్ అమలుపై జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా ప్రకటించిన వికసిత్ ఆంధ్ర - 2047 సాధనే లక్ష్యంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు అధికారులు సమష్టిగా పనిచేయాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, పరిశ్రమలు వాటి అనుబంధ రంగాలు, సేవారంగాల్లో వృద్ధిరేటు సాధించడానికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. పర్ కాపిటా ఇన్‌కం రూ.45వేలు చేయటం ప్రభుత్వ లక్ష్యంగా కలెక్టర్ వివరించారు. సామాజిక, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రైవేటు, పబ్లిక్ పార్టనర్‌షిప్ పీ4 మోడల్ అమలు చేయాలన్నారు. విద్య, వైద్యం, భూమికొనుగోలు ప్రజలకు సౌకర్యవంతంగా ఉండాలన్నారు. విజన్ యాక్షన్ ప్లాన్ తయారీలో సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి రూపొం దించాలని సూచించారు. భవిష్యత్తులో అభివృద్ధి చెందడానికి ఉన్న అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని ఐదేళ్లలో లక్ష్యాలు సాధించడానికి కృషి చేయాలన్నారు. వికసిత్ ఆంధ్ర-2047లో భాగంగా సెప్టెంబరు 10 నుంచి 14వ తేదీ వరకు అన్ని పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు, 10 నుంచి 15వ తేదీ వరకు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. తొలుత సీపీవో సాలెంరాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో కన్నమ నాయుడు, డీఆర్ డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీపీవో సుస్మితారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల రక్షణకు సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ తేవాలి



కావలి : హత్యకు గురైన వైద్యురాలి ఫొటో ప్రదర్శిస్తున్న డాక్టర్లు



ఉదయగిరి రూరల్: నిరసనలో పాల్గొన్న వైద్యఆరోగ్య సిబ్బంది

సీతారామపురం ఆగస్టు 16: మహిళావైద్యులకు సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేసి వారికి రక్షణ కల్పించాలని మండల వైద్యాధికారి స్వప్న డిమాండ్ చేశారు. కోల్‌కత్తా ఆర్‌జీకే ఆర్ మెడికల్ కళాశాలలో జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనపై వ్యతిరేకంగా శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో ఆమె బస్టాండ్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైద్యులు భవ్యశ్రీ, ఎంపీహెచ్ ఈవో మజీద్, రియాజ్, పీహెచ్ ఎన్ క్రిష్టమ్మ, హెల్త్ అసిస్టెంట్స్ తిరుపాల్ రెడ్డి, శేఖర్‌రాజు, శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పిఎస్, ల్యాబ్ టెక్నీషియన్ షబానా వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ ను అత్యాచారం చేసి హత్య చేసిన వారిని శిక్షించాలని గండిపాళెం ప్రాథమి క ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి శివకల్పన డిమాండ్ చేశారు. ఈ విషయంపై స్థానిక పాత సామాజిక కేంద్రం ఆవరణలో వైద్యఆరోగ్య సిబ్బందితో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం చేసిన నిందితులను శిక్షించాలని మహిమలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారిణి అనూష ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది డిమాండ్ చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి పీహెచ్‌సీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యం కోసం శ్రమించే వైద్యులకు రక్షణ లేక పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏఎస్ పేట: కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు మంజుల ఆధ్వర్యంలో సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నల్లబ్యాడ్జీలు ధరించి దోషులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య అధికారులు పాల్గొన్నారు.



సీతారామపురం: నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, సిబ్బంది



బిట్రగుంట : కోవూరుపల్లి పీహెచ్‌సీ వద్ద నిరసన

కావలి: కోల్‌కతాలోని ఆర్‌జీకర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో ఈ నెల 9వ తేదీన డ్యూటీలో ఉన్న జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య సంఘటనలో న్యాయం కోరుతూ శనివారం కావలిలో అన్ని ప్రైవేట్ వైద్యశాలల్లో అత్యవసరం మినహా మిగిలిన అన్ని వైద్యసేవలను 24గంటల పాటు నిలిపివేస్తున్నట్లు ఐఎంఏ బాధ్యులు తెలి పారు. కావలి ఐఎంఏ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం జరిగిన సమావేశంలో హత్యకు గురైన డాక్టర్ చిత్రంతో ఉన్న కరపత్రాలను వైద్యులు ఆ విష్కరించారు. ఈ సందర్భంగా ఐఎంఏ కావలిశాఖ అధ్యక్ష, కార్యదర్శులు కే. సుబ్బారావు, గోపీ, కోశాధికారి శివప్రసాద్ మాట్లాడుతూ ఐఎంఏ పిలుపు మే రకు దేశవ్యాప్తంగా చేస్తున్న నిరసనలో భాగంగా కావలిలో కూడా చేపడుతు న్నట్లు తెలిపారు. డాక్టర్లు అందరూ వారి వైద్య సేవలను శనివారం మూ సి వేసుకుని ఏరియా వైద్యశాల వద్ద ఏర్పాటు చేసిన నిరసన శిబిరంలో పాల్గొం టారన్నారు. అత్యవసర మైతేనే అక్కడ నుంచి సొంత క్లినిక్‌లకు వెళ్లి వైద్య పరీక్షలు చేస్తారన్నారు. వైద్యురాలు అత్యాచారం, హత్యపై విచారణకు ప్రత్యేక కోర్టును ఏ ర్పాటు చేసి సీబీఐ ఆధ్వర్యంలో త్వరితగతిన నేర పరిశోధన పూర్తి చేసి నేరానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రులలో వైద్యులు, వైద్యసిబ్బందికి రక్షణ కల్పించే వ్యవస్థను కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. డిమాండ్లు సాధించే వరకు ఉద్యమాలు కొన సాగిస్తామని చెప్పారు.

కొండాపురం: కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అఘాయిత్యం అమానుషమని మండల వైద్యాధికారులు నసీరుద్దీన్, డాక్టరు భవ్య పేర్కొన్నారు. ఈ ఘటనను ఖండిస్తూ వైద్యశాల దగ్గర భోజనవిరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నిరసనలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కలిగిరి: జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచార ఘటనకు నిరసనగా కలిగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది నిరసన తెలిపారు. విధుల్లో ఉన్న వైద్యురాలిపై మానవీయ విలువలు మరచి దుశ్చర్యలకు పాల్పడిన నిందితులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సిబ్బంది రక్షణకు ప్ర భుత్వం ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బిట్రగుంట: జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి అమానుషంగా చంపిన వారిని కఠినంగా శిక్షించాలని కోవూరుపల్లి పీహెచ్‌సీ వైద్యులు జీహారిక, ప్రవీణ్‌కుమార్ అన్నారు. జూనియర్ డాక్టర్‌పై జరిగిన అఘాయిత్యాన్ని నిరసిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దివ్య, సూపర్‌వైజర్లు, పీహెచ్‌సీ ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

వరికుంటపాడు, ఆగస్టు 16: తెలుగుదేశం కార్యకర్తలకు సమస్య వస్తే అండగా ఉంటామని శాసనసభ్యులు కాకర్ల సురేష్ సోదరుడు కాకర్ల వెంకట్ తెలిపారు. ధర్మవరంలో నెలకొన్న భూ వివాదంలో గాయపడిన తెలుగు యువత అధ్యక్షుడు ముజ్జే లక్ష్మీనారాయణతో పాటు అనుచరులను శుక్రవారం ఆయన పరామర్శించారు. ఘర్షణకు గల కారణాలు తెలుసుకున్నారు. ఎలాంటి వివాదాలకు పాల్పడకుండా సమన్వయం పాటించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు, జడ్పీటీసీ రావెళ్ల నాగేంద్ర, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్, సీనియర్ నాయకులు చంద్ర ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

బహుమతుల అందజేత

ఉదయగిరి రూరల్, ఆగస్టు 16: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గండిపాళెం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అధికారులు గురుకుల పాఠశాలలో నిర్వహించిన వివిధరకాల ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలోని విజేతలకు శుక్రవారం బ్యాంకు మేనేజర్ కె.శోభన్ బాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పుష్పరాజ్, ఫీల్డ్ ఆఫీసర్ ఇంతియాజ్, బ్యాంకు సిబ్బంది షేక్ చినఖాసిం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటినుంచి పాఠశాల సముదాయ సమావేశాలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 16: మండలంలో శనివారం నుంచి సోమవారం వరకు పాఠశాల సముదాయ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎంఈవో షేక్ మస్తాన్‌వలి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి పాఠశాల నుంచి 50శాతం మంది ఉపాధ్యాయులు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

మాతమ్మ తిరునాళ్లకు విరాళం

ఆత్మకూరు, ఆగస్టు 16: మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు అరుధతీయవాడలో వెలసిన శ్రీమాతమ్మ తిరునాళ్ల ఉత్సవాల నిర్వహణకు వింజం దొరసానమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, ఎస్‌వీపీ ప్రజావైద్యశాల ఎండీ డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ శుక్రవారం నిర్వాహకులకు రూ.10వేలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ కుమార్, తోడేటి అశోక్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన సీడీపీవో

ఉదయగిరి రూరల్, ఆగస్టు 16: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో పచ్చవ లావణ్య శుక్రవారం విధుల్లో చేరారు. వ్యక్తిగత కారణాలతో ఆమె మే 16నుంచి ఆగస్టు 14వ తేదీ వరకు సెలవులో ఉన్నారు. సెలవులు పూర్తి కావడంతో తిరిగి విధుల్లో చేరారు.

ఉత్సవాలు ప్రారంభం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 16: కృష్ణంపల్లి సీతారామచంద్ర ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. వేదపండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం, కలశస్థాపన, విగ్రహాల జలాధివాసం తదితర పూజలు చేపట్టారు. ఈ పూజల్లో స్థానికులే కాకుండా పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 16: వరి పంట సాగు చేసే రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని మండల వ్యవసాయాధికారి అంజనేయులునాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన గుడినరవ, గండిపాళెంలోని వరి పంటలను పరిశీలించారు. పంట సాగు చేస్తున్న రైతులకు అవగాహన కల్పించారు. రైతుసేవా కేంద్రాల్లో పాడైన టీవీలు, కియోస్కుల వివరాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుళ్లామన్నారు.

మందుబాబుల ఆందోళన

ఉదయగిరి రూరల్, ఆగస్టు 16: స్థానిక ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద శుక్రవారం మందుబాబులు ఆందోళన చేపట్టారు. దుకాణాల్లో పనిచేసే సిబ్బంది బ్రాండెడ్ మద్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ చీప్‌లిక్కర్‌ను మాత్రమే తమకు విక్రయిస్తున్నారంటూ ఆరోపించారు. బీర్లు కూలింగ్ పెట్టకుండా అమ్మకాలు చేస్తున్నారని, చిల్లర విషయంలో సైతం సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. సిబ్బందితో వాదనకు దిగారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం

సంగం, ఆగస్టు 16: విద్యారంగంలో విశేష సేవలందజేసి స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు ఎంఈవో జానికీరాం. ఈయన్ను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు కలిసి పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆపస్ నాయకులు సురేంద్రరెడ్డి, ప్రభాకర్, బాబు, జయప్రకాశ్ ఉన్నారు.



సంగం: ఎంఈవో జానికీరాంను సత్కరిస్తున్న ఆపస్ నాయకులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వైద్యఆరోగ్య అధికారి పెంచలయ్య చేతుల మీదుగా నర్రవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆరోగ్య పర్యవేక్షకుడు షేక్ రియాజ్ ప్రతిభా అవార్డు అందుకున్నారు. స్థానిక మండల సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి, ఉద్యోగులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సంధ్యాలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ రామ్మో హన్, కార్యదర్శులు పాల్గొన్నారు.



అనంతసాగరం: పైలెట్‌ను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

అనంతసాగరం: స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది 108 పైలెట్ చింతగుంట నరసిం హారెడ్డిని సన్మానించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నరసింహారెడ్డికి బెస్ట్ పైలెట్‌గా అవార్డు రావడం అభినందనీయమన్నారు. డాక్టర్ శ్రావణి, ఈఎంటీ సురేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 16: గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని త్వరితగతిన పరిష్కరించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి తెలిపారు. స్థానిక మండల కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుధ్యం లోపించ కుండా పంచాయతీ, వైద్యసిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీలకతీతంగా గ్రామాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు లేకుం డా చూడాలన్నారు. అనంతరం శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్ చార్జి ఎంపీడీవో సంధ్యారాణి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జయంత్‌రెడ్డి

మంత్రి ఆనంను కలిసిన అఖిల భారత హిందూ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు



మంత్రి ఆనంను పూలమాలతో సత్కరించిన రాజరాజేశ్వరానందస్వామి

సంగం, ఆగస్టు 16: దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని శుక్రవారం అఖిల భారత హిందూ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు, తిరుమనకొండ రాజరాజేశ్వరిదేవీ, కాశీ విశ్వేశ్వరస్వామి ఆశ్రమ పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి నెల్లూరులోని మంత్రి ఇంట్లో కలసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో కూటమి సర్కారు కొలువైన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దేవాలయాలకు ధూపదీప నైవేద్యాలకు పెద్దపీట వేశారన్నారు. అనంతరం మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి పూలమాలతో సత్కరించి దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, పగడాల రఘురామయ్య ఉన్నారు.

దాతల ఔదార్యం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 16: నర్రవాడ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పలువురు దాతలు శుక్రవారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. తుమ్మల చినవెంగయ్య పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చాటిన వారికి నగదు అందజేశారు. అలాగే పచ్చవ ప్రసాద్ రూ.3లక్షలతో అధునాతన భోజనశాలను ఏర్పాటు చేశారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పదిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యా ర్థులకు రూ.7వేలు, రూ.5వేలు, రూ.3వేల చొప్పున అందజేశారు. పాఠశాలలో వలంటీర్లకు పచ్చవ వెంకట రాకేష్ రూ.60 వేలు అందజేశారు. దాతలను ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు.



విద్యార్థికి నగదును అందజేస్తున్న తుమ్మల చినవెంగయ్య

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

సౌభాగ్యమివ్వు.. వరలక్ష్మీ!

- భక్తిశ్రద్ధలతో ఆలయాల్లో వరలక్ష్మీవ్రత పూజలు



బిట్రగుంట : కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు



కావలి ముసునూరులో ప్రత్యేక అలంకారంలో మహాలక్ష్మమ్మ



ఆత్మకూరు: ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మీదేవి

సంగం, ఆగస్టు 16: పెన్నానది ఒడ్డున వెలసిన సంగమేశ్వరాలయంలో శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మీవ్రతం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కామాక్షి దేవి ఉత్సవ విగ్రహానికి క్షీర, పంచామృతాలతో అభిషేకాలు చేసి పూలతో అలంకరించారు. పూజల్లో మహిళలు అధి క సంఖ్యలో పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని ఆలయాల్లో మహిళలు వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, శివాలయం, కన్యకాపరమేశ్వర ఆలయం, అలఘనాథస్వామి ఆలయం, బీఎస్‌ఆర్ సెంటర్‌లోని మహాలక్ష్మిదేవి ఆలయాల్లో వేకువజామునుంచే ప్రత్యేక పూజలు చేశారు.

ఉదయగిరి రూరల్: పట్టణంలోని బీసీ కాలనీ సమీపంలోని సంతానలక్ష్మి ఆలయంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

కలువాయి: కుల్లూరులోని మహాలక్ష్మి ఆలయంలోని అమ్మవారికి మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. అంతకుముందు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన చేశారు. భక్తులకు నందిరెడ్డి పోలయ్య, ధనమ్మలు అన్నదానం చేశారు. గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, నళినమ్మ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దర్శిచెంచు వినయ్‌కుమార్, సుజన దంతులు పాల్గొన్నారు.

కావలిటౌన్ : శ్రావణం మాసం 2వ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కావలి గ్రామ దేవత కలుగోళ శాంభవి, కన్యకాపరమేశ్వరి, విష్ణాలయంలోని రాజ్యలక్ష్మి, బృందావనం కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, సత్య సాయి మందిరం, ముసు నూరు మహాలక్ష్మమ్మ ఆలయం, వెంగళరావు నగర్‌లోని ఆలయాల సముదాయంలో పెద్ద ఎత్తున వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున ఆలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకుని సామూహిక వ్రత పూజలు నిర్వహించారు.

కావలి రూరల్ : ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో ఉండాలని ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి మండలం రాజువారిచింతలపాలెంలోని విజయదుర్గ ఆస్థానపీఠంలో పత్రి వీర బ్రహ్మయ్య స్వామి ఆధ్వర్యంలో జరిగిన సామూహిక వరలక్ష్మీ వ్రతం పూజా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డికి వేదపండితుల మంత్రోచ్చరణలతో స్వాగతం పలికారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కొండాపురం : మండలంలో ప్రజలు శ్రావణ మాసంలో రెండో శుక్రవారం వరలక్ష్మీవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు ఉదయం నుంచే ఆలయాలకు వెళ్లి తమ సౌభాగ్యాన్ని కాపాడాలంటూ లక్ష్మీదేవికి పూజలు చేశారు.

బిట్రగుంట : బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వరలక్ష్మీ వ్రత పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు సత్యనారాయణ చార్యులు ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీదేవీ భూదేవి సమేత శ్రీనివాసుడిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో రాధాకృష్ణ, అర్చకులు లక్ష్మీనరసింహాచార్యులు, కళ్యాణాచార్యులు పర్యవేక్షించారు.

కందుకూరు : శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీవ్రతం కార్యక్రమాన్ని కందుకూరు పట్టణం, పరిసర గ్రామాలలో వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని పెద్దబజారులో ఉన్న కోదండరామాలయంలో, మాచవరంలోని అయ్యలరెడ్డి కొండపైన నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతాల లో వందలాది మంది మహిళలు పాల్గొని వ్రతమాచరించారు. ఈ సందర్భంగా పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు. పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలలో వరలక్ష్మీవ్రతం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.



కావలిటౌన్ : సత్యసాయి మందిరంలో సామూహిక వరలక్ష్మీవ్రతంలో భక్తులు



కందుకూరు : మాచవరం అయ్యలరెడ్డి కొండపై సామూహిక వరలక్ష్మీవ్రతంలో మహిళలు



కలువాయి : కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు



కావలి బృందావనం కాలనీలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



సంగం : వ్రతంలో పాల్గొన్న మహిళలు

పేదలకు పట్టెడన్నం పెట్టేందుకే అన్న క్యాంటీన్

- కావలిలో ప్రారంభించిన ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి

కావలి, ఆగస్టు 16: పేదలకు పట్టెడన్నం పెట్టేందుకే అన్న క్యాంటిన్‌లను రాష్ట్ర ప్రభుత్వం పునఃప్రాంభించిందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చెప్పారు. పట్టణంలోని తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్‌ను శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే ప్రాంభించారు. ఎమ్మెల్యే స్వయంగా పేదలకు అల్పాహారం వడ్డించి వారితో కలిసి భుజించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు అల్పాహారం వడ్డించి వారితో కలిసి భుజించే భాగ్యం కలగడంతో నాజన్మ ధన్యమైందన్నారు. మొదటి రోజు మూడు పూటలకు అయ్యే ఖర్చునంతా తానే భరిస్తానని చెప్పారు. పేదల కోసం ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్‌లను గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసి పేదల కడుపు కొట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2 నెలలకే తిరిగి ప్రారంభించి ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరాం, టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ క్రిషోర్, పోతుగంటి అలేఖ్య, జ్యోతి బాబురావు, చవల రామకృష్ణ, బీజేపీ నేత కే.బ్రహ్మానందం, జనసేన నేత వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



పేదలకు అల్పాహారం అందిస్తున్న ఎమ్మెల్యే

అన్న క్యాంటీన్‌ను ప్రారంభించిన కందుకూరు ఎమ్మెల్యే

కందుకూరు : కందుకూరు పట్టణంలో అన్న క్యాంటిన్‌ను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు శుక్రవారం ఉదయం పునఃప్రారంభించారు. ముందుగా అధికారులు, స్థానిక టీడీపీ నాయకులతో కలిసి క్యాంటిన్ సమీపంలో ఉన్న రావిచెట్టుకు పూజలు నిర్వహించి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు ఆయన స్వయంగా అల్పాహారం వడ్డించటంతో పాటు ఆయన కూడా క్యాంటిన్‌లో అల్పాహారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రతిరోజు 500 మందికి తక్కువ కాకుండా పేదలు అన్న క్యాంటిన్‌లో ఆకలి తీర్చుకున్నారని, గడచిన ఐదేళ్ల జగన్ పాలనలో ఆయన పైశాచికత్వం వల్ల పేదలు ఆకలితో ఇబ్బందిపడ్డారని తెలిపారు. ఇకముందు ఇబ్బందులు ఉండబోవని, కేవలం ఐదు రూపాయలకే అల్పాహారం, భోజనం అందించాలన్న చంద్రబాబునాయుడు సంకల్పం ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహ్మం, ఉన్నం వీరాస్వామి, బీజేపీ, జనసేన నాయకులు గట్టమనేని హరిబాబు, మదన్ తదితరులు పాల్గొన్నారు.



అల్పాహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

ఫ్లోరోసిస్‌పై అవగాహన

బిట్రగుంట, ఆగస్టు 16: ఫ్లోరోసిస్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ఫ్లోరోసిస్ నివారణ జిల్లా అధికారి దివ్య అన్నారు. బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీలో ఫ్లోరోసిస్‌పై వైద్య సిబ్బందికి అవగాహన శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం పాతబిట్రగుంట సబ్‌సెంటర్‌ను సందర్శించారు. అలాగే ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి దివ్య

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

- జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి

బిట్రగుంట, ఆగస్టు 16: కేంద్రప్రభుత్వం ప్రజల ఆర్థికాభివృద్ధికి అందజేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి అన్నారు. బోగోలులోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం సామాన్యుడి ఎదుగుదలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఆ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ఏనుగులబావి పంచాయతీ కొళ్లదిన్నెకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ యాదవ్, కావలి అసెంబ్లీ ఇంచార్జి సీవీసీ సత్యం పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత : ఎమ్మెల్యే

కావలిటౌన్, ఆగస్టు 16: రక్తదానం సామాజిక బాధ్యతని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జనసేన నాయకులు సిద్ధు జన్మదినం పురస్కరించుకుని శుక్రవారం బ్రిడ్జి కూడలిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 207మంది యువత రక్తదానం చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, సోమశిల ప్రాజెక్ట్ మాజీ ఛైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో రంగా యువసేన అధ్యక్షుడు దేవరకొండ శ్రీను, శ్రీధర్‌రెడ్డి, నారపరెడ్డి, రాజ్‌కుమార్ చౌదరి, తిరువీధి ప్రసాద్, గంగినేని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

అల్లూరు, ఆగస్టు 16 : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు. కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి సమావేశానికి హాజరవుతారని తెలిపారు. సమగ్ర నివేదికలతో అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని తెలిపారు.

ఎన్టీఆర్ విగ్రహానికి స్థల పరిశీలన

జలదంకి, ఆగస్టు 16: మండలంలోని బ్రాహ్మణక్రాక పంచాయతీ తొమ్మిదో మైలు వద్ద ఎన్‌హెచ్167 బిజి జాతీయ రహదారి పక్కన ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు టీడీపీ నేతలు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు స్థల ఎంపిక చేసి ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని టీడీపీ మండల అధ్యక్షుడు పీ.మధుమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ స్థల పరిశీలనలో టీడీపీ నాయకులు వంటేరు జయచంద్రారెడ్డి, తల్లపనేని మధుసూదనరావు, దగుమాటి మాల్యాద్రిరెడ్డి, చిత్తాబత్తిన మస్తాన్‌రెడ్డి, స్వర్ణ కొండపనాయుడు, లింగంగుంట దశరథరామయ్య, గంగపట్ల మాలకొండయ్య, వల్లెపు ఏడుకొండలు, ముచ్చాల మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోకు సత్కారం

కావలి, ఆగస్టు 16: కావలి ఆర్డీవో శీనానాయక్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సక్షం ప్రతినిధులు ఆర్డీవో శీనానాయక్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణమోహన్, డాక్టర్ కే.మాధవరెడ్డి, తిరుపతిస్వామి, మంగళగిరి వేణుగోపాల్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డీ.రవిప్రకాష్, బీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతం

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 16: జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షి తాయి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం చుట్టూ భక్తులు దీపారాధనలు చేశారు. ఉదయం గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామికి నిత్య కల్యాణోత్సవం అనంతరం అమ్మవారికి పల్లకి సేవలు నిర్వహించారు. నిత్యాన్నదానానికి భక్తులు బారులు తీరారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.




బుచ్చిరెడ్డిపాళెం: వరలక్ష్మి వ్రతం పూజలో కొలువుదీరిన కామాక్షితాయి. పాల్గొన్న మహిళలు

పెంచలకోనలో...

●**రాపూరు:** పెంచలకోన పుణ్యక్షేత్రంలోని ఆదిలక్ష్మీ అమ్మవారికి వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలమూర్తికి అర్చకులు అభిషేకం చేశారు. అనంతరం శ్రీవారి నందన వనంలోని మండపంలో ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి వరలక్ష్మీదేవిగా అలంకరించి వ్రతం చేపట్టారు. పాల్గొన్న మహిళలకు పసుపు కుంకుమ, గాజులు, జాకెట్లను దేవస్థానం సిబ్బంది అందజేశారు. ఈ వ్రతానికి వచ్చిన భక్తులకు ప్రసాదాన్ని గుండ్లూరు సీతారామయ్య అందజేశారు. ఇబ్బందులు లేకుండా ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయసాగర్‌బాబు పర్యవేక్షించారు.

●**సైదాపురం:** స్థానిక బాలత్రిపుర సుందరీదేవీ ఆలయంలో వరలక్ష్మీ వ్రతం పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే తుమ్మలతలుపూరు మహాలక్ష్మి ఆలయంలో పూజలు నిర్వహించారు.

●**పొదలకూరు:** పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో గల లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి పంచామృత అభిషేకాలు, సహస్ర నామార్చనలు, కుంకుమ పూజలు నిర్వహించారు. లక్ష్మీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పసుపు, కుంకుమ, గాజులు, రవికలతో ప్రత్యేక పూజలు చేశారు.

పౌరసరఫరాల గోడౌన్ తనిఖీ



బియ్యం గోడౌన్ తనిఖీ చేస్తున్న తహసీల్దారు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 16: స్థానిక జెండాదిబ్బ వద్ద ఉన్న పౌరసరఫరాల శాఖ బియ్యం గోడౌన్‌ను తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. గోడౌన్‌లోని స్టాకు రిజిస్టర్ పరిశీలించి వివరాలడిగి తెలుసుకున్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గోడౌన్‌ను పరిశీలించినట్లు ఆయన తెలిపారు.

వరి పైరు పరిశీలన



వరి పైరు పరిశీలిస్తున్న ఏవో హైమావతి

సైదాపురం, ఆగస్టు 16: దేవరవేమూరలో వరి పైరును శుక్రవారం మండల వ్యవసాయాధికారి హైమావతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆకు ముడతను గుర్తించారు. నివారణకు క్లోరీ ఫైరిఫాస్ మందును లీటర్ నీటిలో 2ఎంయల్ కలిపి స్ప్రే చేస్తే నివారణ చేయవచ్చని రైతులకు అవగాహన కల్పించారు.

83 మద్యం సీసాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

తోటపల్లిగూడూరు, ఆగస్టు 16: మండలంలో వరకవిపూడి పంచాయతీ పరిధిలోని అనంతపురం గ్రామంలో మర్రి చంద్రశేఖర్‌రావు అనే వ్యక్తి నుంచి 83 మద్యం సీసాలను గురువారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం నిల్వచేసి అధిక ధరకు అమ్ముతున్నాడని సమాచారం అందడంతో ఎస్‌ఐ జంపానీ కుమార్ దాడిచేసి నిందితుడిని అరెస్టుచేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తీర ప్రాంతాల నుంచి అక్రమంగా మట్టి తరలింపు



మట్టి తరలిస్తున్న టిప్పరు

తోటపల్లిగూడూరు, ఆగస్టు 16: మండలంలోని తీర ప్రాంత గ్రామాల నుంచి రాత్రి పగలు తేడా లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. తీర ప్రాంతాలైన కోడూరు, వెంకన్నపాలెం, ముత్యాలతోపు, ఈదూరు గ్రామాల నుంచి నిత్యం మట్టి ప్రైవేటు లేఅవుట్లకు తరలిపోతోంది. మైనింగ్ అనుమతులు ఉన్నాయంటూ యంత్రాలతో పెద్ద పెద్ద గుంతలు తవ్వి తరలిస్తున్నారు. అక్రమ తరలింపుపై ఎవరైనా అధికారులకు సమాచారం ఇస్తే వారిపై కూడా మట్టి మాఫియా దాడులకు దిగుతుండడంతో నోరు మెదిపేందుకు భయ పడుతున్నారు. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి మట్టి మాఫియాకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ధూపదీప నైవేద్య పథకం మంజూరు చేయండి

● వెంకయ్యనాయుడు, ఆనంకు పూజారుల వినతి



వెంకయ్యనాయుడు, మంత్రి ఆనంతో మాట్లాడుతున్న పూజారులు

వెంకటాచలం, ఆగస్టు 16: దేవాలయాలకు ధూపదీప నైవేద్య పథకం మంజూరు చేయాలని పరమేశ్వరి అమ్మవారి దేవాలయాల పరిరక్షణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆరుముళ్ల మురళీ కోరారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో శుక్రవారం పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలను నాలుగు జిల్లాల నుంచి వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ పూజారులు కలిసి సన్మానించారు. ఈసందర్భంగా వెంకయ్యనాయుడు పూజారులకు న్యాయం చేయమని పక్కనే ఉన్న దేవాదాయ శాఖ మంత్రి ఆనంకు సూచించారు. దీంతో మంత్రి ఆనం మాట్లాడుతూ సీఎం చంద్రబాబుతో మాట్లాడి త్వరలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కర్నాటి అంజనేయరెడ్డి, సురేంద్రరెడ్డి, కమిటీ ఉపాధ్యక్షుడు వీ రాధాకృష్ణ, జీ వెంకటేశ్వర్లు, టీ శేషయ్య తదితరులున్నారు.

స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలు అమోఘం : మంత్రి ఆనం

పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు నెలకొల్పిన స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలు అమోఘమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కొనియాడారు. శుక్రవారం స్థానిక స్వర్ణభారత్ ట్రస్ట్‌ను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా వెంకయ్యనాయుడు కుమార్తె, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్‌ను కలిసి మాట్లాడుతూ 24వ వారికోత్సవ వేడుకలకు భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రావడం ఆనందదాయకమన్నారు. దీపావెంకట్ సారధ్యంలో మంచి కార్యక్రమాలను స్వర్ణభారత్ ట్రస్ట్ నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్ సేవా కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ప్రశాంతిరెడ్డి ధ్యేయం

● గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మందిపాటి ప్రవీణ్ కుమార్‌రెడ్డి

కొడవలూరు, ఆగస్టు 16: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కృషి చేస్తున్నారని మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందిపాటి ప్రవీణ్ కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని నార్తు రాజుపాళెంలో శుక్రవారం గ్రామ అభివృద్ధిపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నార్తు రాజుపాళెంలో నిరుపేదలకు నివేశన స్థలాలు, పక్కాఇళ్లు ఎమ్మెల్యే సహకారంతో అందించేందుకు కృషిచేస్తామన్నారు. పార్కు ఏర్పాటు చేయనున్నామన్నారు. కాగా, పారిశ్రామిక వేత్త పోలంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నార్తు రాజూపాళెం పాఠశాలలోని ల్యాబ్‌కు రూ. 3లక్షల ఆర్థిక సహాయం చేయడంపై ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు తదితులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మందిపాటి

సచివాలయానికి వాటర్ కూలర్ వితరణ

తోటపల్లిగూడూరు, ఆగస్టు 16: నరుకూరు గ్రామ సచివాలయానికి శుక్రవారం ఏటూరు రవి తన తండ్రి దివంగత ఏటూరు రమణయ్య, సోదరుడు దివంగత ఏటూరు గోపిల జ్ఞాపకార్థం వాటర్ కూలర్‌ను బహూకరించారు. గ్రామ సర్పంచ్ అన్నం శారద కూలర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొణతం రఘుబాబు, మాజీ ఎంపీటీసీ పాకం వెంకయ్య, బీజేపీ నేత అన్నం శ్రీనివాసులు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఆరికాటి వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు నాసిక శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

● జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యుల నిరసన



జొన్నవాడ పీహెచ్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది.

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 16: కోల్‌కత్తాలోని ఆర్.జీ వైద్య కళాశాల ఆసుపత్రిలో పీజీ చేస్తున్న మహిళా డాక్టర్‌పై హత్యాచారం దారుణమని జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అహ్మద్‌బాబు అన్నారు. ఈఘటనపై జిల్లా డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు శుక్రవారం జొన్నవాడ పీహెచ్‌సీ వద్ద పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బందితోపాటు బుచ్చి కోలోకేటెడ్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. నిరసన కార్యాక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ వినయ్ కుమార్, సుబ్బారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

●**రాపూరు:** గత కొంతకాలంగా వైద్య ఆరోగ్య సిబ్బందిపై చేస్తున్న దాడులను ఖండిస్తూ వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది శుక్రవారం నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వీవీ సూర్యధర్మ మాట్లాడారు. కలకత్తాలో జూనియర్ డాక్టర్ హత్య సంతాపం తెలిపారు. ప్రభుత్వం వైద్య సిబ్బందిపై జరిగే దాడులను ఖండించి రక్షణ కల్పించాలని కోరారు.

కోవూరులో ట్రాఫిక్ కష్టాలు

● ప్రజలు, వాహన చోదకుల అవస్థలు

కోవూరు, ఆగస్టు 16: ట్రాఫిక్ సమస్యతో కోవూరు వాసులు కష్టాలు పడుతున్నారు. నెల్లూరు నగరంలోని వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగువ భాగంలో పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో కుంగడంతో నెల్లూరు - కడప మార్గంలోని ట్రాఫిక్‌ను కోవూరు మీదుగా మళ్లించారు. భారీ వాహనాలు కోవూరు పట్టణంలోని ప్రధాన రహదారి మీదుగా ప్రయాణిస్తుండటంతో స్థానికులు ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. కృష్ణపట్టణం నుంచి కడప వైపునకు బూడిద తీసుకువెళ్తున్న భారీ వాహనాల వల్ల నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతోంది. కడప వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సులు, కార్లు తదితర వాహనాలు ఎక్కువగా ఉండటంతో పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. బరువైన సామాగ్రితో భారీ వాహనాలు పెద్దసంఖ్యలో వెళ్తుండటంతో స్వాతంత్ర్యానికి పూర్వం నిర్మించిన రెండు బ్రిడ్జీలు కూలిపోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఓవైపు పోలీసులు భారీ వాహనాలకు ప్రవేశంలేదని బోర్డులు పెట్టినప్పటికీ ప్రయోజనం లేకపోయింది, వాహనాల డ్రైవర్లు పోలీసుల నిబంధనల్ని తుంగలో తొక్కి ప్రధాన రోడ్డులో వెళ్తుండటంతో నిత్యం బజారు కూడలిలో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంకటేశ్వరపురం ఫ్లైఓవరుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



కోవూరు బజారుకూడలిలో స్తంభించిన ట్రాఫిక్

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాం : ఎస్‌ఐ

కోవూరులో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాం. బజారు కూడలిలో పోలీసుల్ని నియమించాం. సాయిబాబా గుడి వైపు నుంచి పట్టణంలోకి భారీ వాహనాలు రాకుండా నిరోధించాము. వాహనాలు నార్తురాజుపాళెం మీదుగా బుచ్చిరెడ్డిపాళెం వైపు వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నాం. సాలుచింతల, బజారుకూడలి, సాయిబాబా గుడి సమీపంలో పోలీసుల్ని నియమించాం. పట్టణంలోకి భారీ వాహనాలు రాకుండా నిరోధించామని ఎస్‌ఐ రంగనాథ్ గౌడ్ తెలిపారు.

వరలక్ష్మీ మముకావవే!


● ఆలయాల్లో వైభవంగా వరలక్ష్మీ వ్రతం



స్వర్ణ మహాలక్ష్మీ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 15 : నగరంలోని ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించారు.

● సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మీ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం జరిగింది. స్వర్ణ మహాలక్ష్మి అమ్మవారి మూలమూర్తికి విశేష అలంకారం, పూజలు జరిగాయి. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ● శబరి శ్రీరామక్షేత్రంలో సీతాదేవి వరలక్ష్మీగా దర్శనమిచ్చింది. అర్చకుడు నరేష్ భక్తులతో వరలక్ష్మీ వ్రతం చేయించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. చంద్రారెడ్డి సుబ్బరాజు, అన్నం దయాకర్‌గౌడ్, దద్దోలు రమణయ్య పర్యవేక్షించారు. కాగా, ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఉదయం 6గంటలకు పంచామృతాభిషేకం, హోమం, సామూహిక లక్ష తులసీదళ అర్చన, అన్నదానం, సాయంత్రం సీతారామ కల్యాణం, ఆంజనేయస్వామికి పల్లకీసేవ జరుగుతాయని ఆలయ చైర్మన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ● స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం కన్నుల పండువగా జరిగింది. ఉదయం అమ్మవారికి అభిషేకం, విశేష పూజలు జరిగాయి. రాత్రి బంగారు చీర అలంకరణలో వాసవీ దేవి భక్తులను అనుగ్రహించింది. 108 మంది మహిళలకు పసుపు కుంకుమ వితరణ చేశారు. ఆలయ చైర్మన్ కోట గురుబ్రహ్మం, ధర్మకర్తలు, పర్యవేక్షించారు. ● మహాత్మాగాంధీనగర్‌లోని కృష్ణమందిరంలో వైభవలక్ష్మికి ప్రత్యేక అలంకరణ, వరలక్ష్మీ వ్రతం జరిగాయి. మందిర కార్యదర్శి సుబ్బరామరాజు పర్యవేక్షించారు. ● పప్పులవీధి మహాలక్ష్మీ ఆలయంలో వరలక్ష్మీ వ్రతం జరిగింది. 1008 మంది ముత్తైదువులకు పసుపు కుంకుమ, గాజులు, పసుపుతాడు, ఎర్ర, నల్లపూసలు అందజేశారు. ● మూలస్థానేశ్వరాలయంలో ఉదయం కన్నుల పండువగా వరలక్ష్మీ వ్రతం జరిగింది. రాత్రి భువనేశ్వరి అమ్మవారికి ఊంజల్ సేవ జరిగింది. దేవదాయ శాఖ ఏసీ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.




బంగారు చీరలో కన్యకాపరమేశ్వరి, శబరి శ్రీరామ క్షేత్రంలో వ్రతం చేస్తున్న భక్తులు




విశేష అలంకరణలో వైభవలక్ష్మి, భువనేశ్వరి అమ్మవార్లు

పేదవాడి ఆకలి తీర్చడమే ధ్యేయం

● అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవాల్లో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు

నెల్లూరు (సిటీ), ఆగస్టు 16 : పేదవాడికి పట్టెడన్నం పెట్టాలన్న ఉద్దేశంతో తమ ప్రభుత్వం తిరిగి అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తెచ్చిందని రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం నెల్లూరులోని చేపల మార్కెట్ వద్ద మంత్రి నారాయణ, పాతమున్సిపల్ కార్యాలయం వద్ద ఆనం రామనారాయణ రెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఇందిరా భవన్ వద్ద ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జేసీ కార్తీక్, ఏసీ కూరగాయల మార్కెట్ వద్ద రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, 8వ డివిజన్‌లోని తడికల బజార్ వద్ద కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, డైకస్‌రోడ్డు వద్ద టీడీపీ నేత గిరిధర్ రెడ్డిలు అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో మంత్రు లు ఆనం, నారాయణ మాట్లాడుతూ ఎన్టీఆర్ స్ఫూర్తితో ఏపీలో అన్న క్యాంటీన్లను 2014లో తమ ప్రభుత్వం తీసుకు వచ్చిందన్నారు. అయితే, వైసీపీ అధికారంలోకి వచ్చాక వీటిని నిర్దాక్షిణ్యంగా తొలగించాయని అన్నారు. పైగా సేవా కార్యక్రమా లతో ఎవరైన నిర్వహిస్తే వారిని వేధించారని దుయ్యపట్టారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే క్యాంటీన్లను పునఃప్రారంభిం చినట్లు చెప్పారు. పేదవాడి ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లుకు దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేయా లని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమాలలో కార్పొరేషన్ కమిష నర్ మల్లవరపు సూర్యతేజ, తెలుగుదేశం పార్టీ నేతలు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జనసేన అధికార ప్రతినిధి అజయ్‌కుమార్, నాయకులు తాళ్లపాక అనురాధ, భానుశ్రీ, సుజయ్‌బాబు, స్థానిక కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇందిర భవన్ వద్ద అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఎంపీ వేమిరెడ్డి



ఏసీ కూరగాయల మార్కెట్ వద్ద రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నగరాభివృద్ధికి సమష్టిగా కష్టపడాలి

● మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), ఆగస్టు 16 : కార్పొరేషన్‌లోని అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి నెల్లూరు నగర అభివృద్ధికి శక్తివంచనలేకుండా కష్టపడాలని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ సూచించారు. శుక్రవారం కార్పొరేషన్‌లో వివిధ విభాగాల అధిపతులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. నగరాన్ని శుభ్రంగా ఉంచేందుకు కావాల్సిన ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. అవసరమైన వాహనాలు, పనిముట్లు, నూతన విధానాలపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పందులు, కుక్కలు, కోతులు, రోడ్లపై పశువులను నిలువరించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జనన, మరణ నమోదు, ధ్రువీకరణ పత్రాల జారీలో పూర్తిగా ఆన్‌లైన్ విధానం అమలు చేయాలని స్పష్టం చేశారు. చెత్త తరలింపు, కాలువల్లో పూడికతీత, వీధిలైట్లు వంటి సమస్యలను పరిష్కరించాలన్నారు. చెత్త రీసైక్లింగ్ వ్యవస్థకు సంబంధించి విదేశాల్లో అనుసరిస్తున్న యంత్రాలు, పద్ధతులను ఇక్కడ కూడా అమలు చేసేందుకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎం సూర్యతేజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నారాయణ

ఆర్టీసీ జైభీమ్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు (హరనాథ పురం), ఆగస్టు 16 : ఏపీఎస్ఆర్టీసీ జైభీమ్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం నగరంలోని ఒక హోటల్ లో ఎన్నుకున్నారు. ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ బుజ్జి, రాష్ట్ర కార్యదర్శులు బీవీ ఎస్ఎస్ నారాయణ, వై జగన్నాథం ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పీ శ్రీనివాసులు, కార్యదర్శిగా బీ బ్రహ్మయ్య, కోశాధికారిగా సుధాకర్, సహాయకార్యదర్శిగా జీ వెంగళరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కే శీనయ్య ఎన్నికయ్యారు. అనంతరం ఆర్టీసీ ఆర్ఎం విజయ రత్నంను కలిశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పీఎస్‌వీ గౌతం, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ ఆర్ఎంతో నూతన కమిటీ నాయకులు

అందరికీ అందుబాటులో హైవే గ్రీన్ సిటీ


నెల్లూరు(హరనాథ పురం), ఆగస్టు 16 : నగర పరిసర ప్రాంతాల్లో పలు విజయవంతమైన ప్రాజెక్టులు పూర్తి చేసి వినియోగదారుల మన్ననలు పొందిన స్కంద డెవలపర్స్ నుంచి శుక్రవారం ఆమంచర్లలో లక్ష్మీ నరసింహ హైవే గ్రీన్ సిటీని ప్రారంభించామని నిర్వాహకుడు గూడూరు రుషికుమార్‌రెడ్డి తెలిపారు. కాలుష్య రహిత వాతావర ణంలో అందరికీ అందుబాటులో ఉండే విధంగా సౌకర్యవంతమైన ఓపెన్ ప్లాట్లను విక్రయిస్తున్నామని తెలిపారు. పుష్కలమైన మంచినీటి వసతి, వాస్తు, విద్యుత్ సౌకర్యం, తారురోడ్డు సెక్యూరిటీ, సీసీ కెమెరాల పరిరక్షణ, వెంచర్ చుట్టూ ప్రహరీ గోడ, డ్రైనేజీ సిస్టం, అవెన్యూ ప్లాంటేషన్ సౌకర్యాలను వినియోగదారులకు కల్పిస్తున్నామని చెప్పారు. దీనికి సంబంధించిన బ్రోచర్లు విడుదల చేశారు. ప్రజలు తమను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వసంతరెడ్డి, సునీల్ చౌదరి, ప్రసాద్ గుప్తా, హలీం తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న నిర్వాహకులు

పారిశుధ్య కార్మికులకు సన్మానం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 16 : స్వాతంత్ర్య దిన వేడుకల్లో భాగంగా శుక్రవారం నగరంలోని బృందావనంలో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఉదయం నగర ప్రజలు నిద్ర లేచే సమయానికే పారిశుధ్య కార్మికులు ఆయా ప్రాంతాలను శుభ్రం చేస్తారన్నారు. జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు.



సన్మాన అనంతరం పారిశుధ్య కార్మికులతో గునుకుల కిషోర్

పంటకు నీటి ఎద్దడి రానివ్వొద్దు : ఏడీఏ



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు రూరల్, ఆగస్టు 16 : ప్రస్తుతం వరి పైరు గింజపట్టే దశలో ఉన్నందున నీటి ఎద్దడి రానివ్వొద్దని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. దేవరపాళెం, ములుముడి గ్రామాల్లో పంట పొలాలను నెల్లూరు ఏడీ ఎన్ శ్రీనివాసులు, ఏవో ఎస్వీ నాగమోహన్ శుక్రవారం పరిశీలించారు. ప్రస్తుతం పంట దశ అత్యంత ముఖ్యమైందని, ఈ దశలో నీరు రెండు అంగుళాలు తగ్గకుండా పొలాల్లో ఉండాలని సూచించారు.


'ఇంటింటా భగవద్గీత నెల్లూరు అంతా భగవద్గీత'

● రేపు నగరంలో మహార్యాలీ

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 16 : గీతా వైభవ్ ట్రస్ట్ 6వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 9గంటలకు ఇంటింటా భగవద్గీత - నెల్లూరు అంతా భగవద్గీత పేరుతో మహా ర్యాలీ జరుగుతుందని ట్రస్ట్ వ్యవస్థాపకుడు షేక్ నజీర్‌బాషా, ఎన్ రవి, ఎన్ ఇందిర, ఎం శ్రీనివాసరావు, జీ నాగేశ్వరరావు, సీహెచ్ శశిధర్ తెలిపారు. శుక్రవారం ట్రస్ట్ కార్యాలయంలో బ్రోచర్లు ఆవిష్కరించి విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఇంట భగవద్గీత ఉండాలని, భగవద్గీతపై నిత్యం ప్రవచనాలు జరగాలని, అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యాంశంగా చేర్చాలన్నదే తమ సంకల్పమన్నారు. తాము గతేడాది 12 డివిజన్లలో ఇంటింటా ప్రచారం చేసి భగవద్గీత గ్రంథాలు పంచామన్నారు. వారందరితో కలిసి ఈ మహార్యాలీని స్టోన్‌హౌస్‌పేట గీతా మందిరం నుంచి పురమందిరం వరకు నిర్వహిస్తామన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5గంటల వరకు సభ జరుగుతుందని తెలిపారు. అన్ని పార్టీల నేతలు హాజరవుతారని, ప్రజలందరూ పాల్గొనాలని కోరారు.

ఏపీజీఈఏ గుర్తింపు దినోత్సవం

నెల్లూరు (హరనాథ పురం), ఆగస్టు 16 : ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుర్తింపు దినోత్సవం శుక్రవారం నగరంలోని ఆ అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షుడు బీ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ నాయకత్వంలో తమ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మ గౌరవాన్ని ఇనుమడింప చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జీ శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కార్యదర్శి పీవీఎస్‌టీ రాంప్రసాద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



వైద్యులకు రక్షణ లేదా?

- స్విమ్స్‌లో జూడాల వినూత్న నిరసన
- కోల్‌కతా డాక్టర్ హత్యపై నాటక ప్రదర్శన



రుయాస్పత్రి వద్దా నిరసన

కోల్‌కతాలో జరిగిన హత్యను వ్యతిరేకిస్తూ ఎస్వీ వైద్య కళాశాలలోని జూనియర్, పీజీ డాక్టర్లు రుయాస్పత్రిలో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.వీరికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మద్దతుగా నిలిచారు. ఆయన మాట్లాడుతూ.. విధుల్లోని జూనియర్ డాక్టరుపై ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమన్నారు.పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చట్టాలను తేవాలని డిమాండ్ చేశారు.హత్యపై పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తుందన్నారు.



స్విమ్స్ వద్ద జూనియర్ డాక్టర్ల నాటక ప్రదర్శన

తిరుపతి (వైద్యం), ఆగస్టు 16: కోల్‌కతాలోని ఆర్జీ కార్ వైద్య కళాశాలలో జరిగిన జూనియర్ మహిళా డాక్టరు హత్యను నిరసిస్తూ స్విమ్స్‌లోని జూనియర్ డాక్టర్లు (జూడాలు) శుక్రవారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. ఆవరణలో ర్యాలీ చేశాక స్విమ్స్ సర్కిల్ వద్ద హత్యను వివరిస్తూ నాటక ప్రదర్శన నిర్వహించారు. మహిళా రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శను స్విమ్స్‌కు వచ్చే రోగులతో పాటు పరిసర ప్రాంతాల్లోనివారు ఆసక్తిగా తిలకించారు. విధుల్లో ఉండే డాక్టర్లకు రక్షణ లేకుండా పోతుందని, మహిళా డాక్టర్లకు అయితే కనీస రక్షణ చర్యలు కూడా ప్రభుత్వాలు ఏర్పాటు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనల్లో నిందితులకు కఠిన శిక్షలు, చట్టాలు అమలు చేయాలని, అపుడే పునరావృతం కాకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ ఆర్డీఎస్‌ఏ వైద్యులు, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కళంకిత కార్పొరేటర్లు అవసరమా?

- టీడీపీలో చేరేందుకు వైసీపీ కార్పొరేటర్ల తహతహ
- వారంతా భూమన షాడోలంటున్న స్థానిక నాయకులు
- తర్వాత చూస్తామని తిప్పిపంపిన పార్టీ అధిష్ఠానం



మంత్రి రాంప్రసాద రెడ్డితో అన్నా రామచంద్ర, సిద్ధారెడ్డి తదితరులు

తిరుపతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : గడిచిన ఐదేళ్లలో అరాచకశక్తులుగా మారి ప్రజలను ఎన్నోరకాలుగా ఇబ్బంది పెట్టిన కొందరు వైసీపీ కార్పొరేటర్లు ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉండలేకపోతున్నారు. పార్టీ కండువా కప్పేసుకుంటామని కూటమి నేతల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీకి తలపడ్డవారి బతుకు మీద కొట్టడమే కాక చేయాల్సిన అరాచకాలన్నీ చేసేసి అవేమీ గుర్తులేనట్టుగా జంపింగ్‌కు సిద్ధపడుతున్న వారికి కొందరు కూటమి నేతలు రెడ్‌కార్పెట్ పరుస్తుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.వైసీపీ అధికారంలో ఉండగా ఎలాంటి పదవీ లేకపోయినా ముఖ్యనేతకు దగ్గరగా మెలిగిన ఓ కీలక నేత టీడీపీలోకి వచ్చేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.అప్పట్లో ఎలాంటి సెటిల్‌మెంటైనా అతడి కార్యాలయంలోనే జరిగేది. తన ఇంటిలో ఓ కార్పొరేటర్ ఉండగా, సమీప బంధువు మరొకరు,అనుచరులైన మరో ముగ్గురు మొత్తం ఐదుగురు కార్పొరేటర్లను కూటమిలోకి తీసుకొస్తానంటున్న ఆయన డిప్యూటీ మేయర్ పదవి తన కుటుంబానికే ఇవ్వాలని డిమాండు చేస్తున్నట్టు సమాచారం.43వ డివిజన్లో పోటీకి దిగిన టీడీపీ అభ్యర్థికి చెందిన టీ దుకాణాన్ని అధికార బలంతో ధ్వంసం చేశారు.45వ డివిజన్ పరిధిలో టీ దుకాణం నడుపుతున్న ఓ టీడీపీ కార్యకర్తపై దాడి చేసి గాయపరిచారు. ఎన్నికల ముందు 'జగన్ రెడ్డి మరో 30 ఏళ్లు సీఎంగా ఉంటారు. మా పార్టీలోకి వచ్చేయండి' అని భయపెట్టిన వైసీపీ నేతలు కూడా ఇప్పుడు కూటమిలోకి వచ్చేందుకు పరితపిస్తున్నారు.మూడున్నరేళ్లుగా అధికారబలంతో టిఫిన్ బండి నుంచి కూడా మామూళ్లు వసూలు చేసుకోవడానికి అలవాటు పడ్డ ఇంకొందరు కార్పొరేటర్లు కూడా పార్టీ మారేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.డివిజన్లో ఇల్లు కట్టుకునేందుకు ఎవరైనా ఇటుకలు తోలుకుంటే కూడా డబ్బులు డిమాండు చేసిన కార్పొరేటర్లు ఇప్పుడు కూటమిలోకి రావడం వలన ఎవరికి ప్రయోజనమో పార్టీ అధిష్ఠానాలు బాగా ఆలోచించాల్సివుంది.

మేయర్ రాకపోతే వీరొచ్చినా ఉపయోగంలేదు

50 డివిజన్లున్న తిరుపతి కార్పొరేషన్‌కు మూడున్నరేళ్ల క్రితం ఎన్నికలు జరిగాయి. నామినేషన్ ఉపసంహరణ సమయంలో వివాదం జరిగి ఒక డివిజన్‌కు ఎన్నిక ఆగిపోయింది. మిగిలిన 49 డివిజన్లలో అధికార బలంతో 28 డివిజన్లను ఏకగ్రీవాలు చేసుకున్నారు. అంటే మేయర్ బెర్త్‌ను ముందుగానే సిద్ధం చేసుకున్నారు. తక్కిన 21 డివిజన్లకు ఎన్నికలు జరిగితే ఒక్క డివిజన్లోనే టీడీపీ జెండా ఎగురవేసింది. దొంగ ఓట్లతో వైసీపీ తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది.అయితే సార్వత్రిక ఎన్నికలకు ముందు ఐదుగురు కార్పొరేటర్లు వైసీపీని వీడి కూటమి పార్టీల్లో చేరారు. ఇద్దరు టీడీపీలోకి, ముగ్గురు జనసేనలోకి మారారు. అయితే నాలుగేళ్ల పదవీ కాలం పూర్తయ్యే వరకు మేయర్‌పై అవిశ్వాసం పెట్టకుండా గత వైసీపీ ప్రభుత్వం మున్సిపల్ చట్టాన్ని సవరించింది. దీంతో నో కాన్ఫిడెన్స్ మోషన్ కాలవ్యవధిని కుదిస్తూ చట్ట సవరణ మళ్లీ చేస్తే తప్ప కొత్త మేయర్ ఎన్నిక జరగదు. నాలుగేళ్లు పూర్తయ్యేందుకు ఇంకా ఆరు నెలల సమయముంది. పార్టీ మారేందుకు సందిగ్ధంలో ఉన్న మేయర్ డాక్టర్ శిరీష వైసీపీలోనే కొనసాగేందుకు సిద్ధపడుతున్నట్టు సమాచారం. అందువల్ల ఇప్పటికిప్పుడు మెజారిటీ కార్పొరేటర్లు కూటమి వైపు వచ్చినా కూటమి ఖాతాలోకి మేయర్ పీఠం చేరదు.

ఇందుకేనా వచ్చేది?

వైసీపీ స్థానిక నాయకత్వం అనుమతితోనే కొందరు కార్పొరేటర్లు కూటమిలోకి వస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీలో ఉంటే అన్ని విధాలా ప్రయోజనాలు పొందవచ్చని, ఇక్కడి రహస్యాలను చేరవేసేందుకు కూడా అవకాశం ఉంటుందన్న రాజకీయ కోణంతో వైసీపీ నాయకత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. దీంతో పాటు మరో ఏడాదిన్నరలో జరగనున్న కార్పొరేషన్ ఎన్నికల్లో తమ కార్పొరేటర్ సీటును అధికార పార్టీనుంచి హామీ తీసుకుని పోటీ చేయాలని మరికొందరు పార్టీ మారేందుకు సిద్ధపడుతున్నారు.శ్రీకాళహస్తికి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యేని వెంటబెట్టుకుని శుక్రవారం ఓ పదిమంది కార్పొరేటర్లు విజయవాడ బాట పట్టారు. పార్టీ కండువాలను కప్పేసుకోవడానికి సిద్ధపడితే, ఈనెల 21న జరిగే క్యాబినెట్ సమావేశం తరువాత స్థానిక నాయకత్వంతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని టీడీపీ ముఖ్యనేతలు తిప్పి పంపినట్టు తెలిసింది.

వీరి గురించి సమాచారమివ్వండి

టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్న కార్పొరేటర్ల గురించి ఆరా తీసేందుకు పార్టీ అధిష్ఠానం సిద్ధమైంది. ఆదం సుధాకర రెడ్డి కుమార్తె ఆదం లీల (9వ డివిజన్ కార్పొరేటర్), దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి కుమారుడు ప్రతాపరెడ్డి(10వ డివిజన్), దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి భార్య ప్రవళ్లికా రెడ్డి(11), మహేష్ రెడ్డి భార్య షాలిని రెడ్డి (15), వెంకటముని రెడ్డి తల్లి రాజమ్మ (20), డిష్ చంద్ర భార్య సునీత (22), పొన్నాల చంద్ర (28), దూది శివ భార్య కుమారి (33), మునిరామి రెడ్డి భార్య శ్రావణి (34), కుడితి సుబ్రమణ్యం (36), బాలసుబ్రమణ్యం భార్య గీత (37), నరేంద్ర నాధ్(38), మురళీ యాదవ్ భార్య రాధ (43), పెంచలయ్య భార్య రాణి (46), అనిల్ (50), ఈశ్వరి (21), అనీష్ రాయల్ (45)తో పాటు ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన అన్నా రామచంద్రయ్య కుమార్తెలు అన్నా సంధ్య (48), అన్నా అనిత (49వ డివిజన్ కార్పొరేటర్)ల గురించి పూర్తి సమాచారం కావాలని స్థానిక నాయకత్వాన్ని టీడీపీ కోరినట్లు సమాచారం.

వాళ్లను తీసుకోవద్దు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి వినతి

ఐదేళ్లుగా తమను ఇబ్బంది పెట్టిన వైసీపీ కార్పొరేటర్లను పార్టీలోకి తీసుకోవద్దని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును స్థానిక టీడీపీ నేతలు కోరారు. శుక్రవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడికి వైసీపీ కార్పొరేటర్ల ఆగడాల గురించి వివరించారు. స్థానిక నాయకత్వానికి ఎలాంటి సమాచారం లేకుండా పార్టీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనివలన పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి కూడా తీసుకెళ్లి ఆ పార్టీలో కూడా చేర్చుకోనివ్వకుండా చూడాలని కోరారు. పల్లా శ్రీనివాసరావును కలిసినవారిలో 43వ డివిజన్ ఇంచార్జి ఆర్సీ శ్రీనివాసులు, పార్లమెంటు ఉపాధ్యక్షుడు మునిశేఖర్ రాయల్, బాలసుబ్రమణ్యం రెడ్డి, సుబ్రమణ్యం ఉన్నారు.



టీడీపీలో చేరేందుకు విజయవాడ వెళ్లిన వైసీపీ కార్పొరేటర్లు, నేతలు

జయహో

షార్‌లో సంబరాల హోరు





రాకెట్ మొదటి దశ



రెండవ దశ



మూడవ దశ



నాల్గవ దశలో విడిపోతున్న ఉపగ్రహం

అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో మరోసారి మెరిసింది. ఎస్ఎస్ఎల్వీ-డీ 3 రాకెట్ ప్రయోగ విజయంతో మరో చారిత్రాత్మక మైలురాయిని దాటింది. చిన్న ఉపగ్రహ వాహక నౌక ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసిన ఇస్రో శాస్త్రవేత్తలు ఈఓఎస్-08 ఉపగ్రహంతో పాటు మరో రెండు బుల్లి ఉపగ్రహాలను దిగ్విజయంగా కక్ష్యలో ప్రవేశపెట్టడంతో షార్‌లో సంబరాలు మిన్నంటాయి. మిషన్ కంట్రోల్ సెంటర్‌లో రాకెట్ గమనాన్ని తిలకిస్తున్న శాస్త్రవేత్తల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఇది శాస్త్రవేత్తలు దేశానికి ఇచ్చిన కానుకగా ఇస్రో చైర్మన్ సోమనాథ్ అభివర్ణించారు.రాకెట్ విజయానికి అహర్నిశలూ పనిచేసిన శాస్త్రవేత్తలను అభినందించారు.

దశల వారీగా రాకెట్ విడిపోయింది ఇలా..

ఎస్ఎస్ఎల్వీ-డీ 3 రాకెట్ అన్ని దశలనూ సునాయాసంగా పూర్తి చేసుకొని 17 నిమిషాల్లో ఈఓఎస్-08 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి విజయవంతంగా చేర్చింది. 34 మీటర్ల పొడవు, రెండు మీటర్ల వెడల్పు, 119 టన్నుల బరువు గల రాకెట్ తన మొదటి దశలో 87 టన్నుల ఘన ఇంధనంతో భూమి నుంచి నింగిలోకి పయనమై 124 సెకన్లకు 93 కి.మీ ఎత్తులో తొలి దశ పూర్తి చేసుకొంది. 7.7 టన్నుల ఘన ఇంధనంతో 125 సెకన్లకు ప్రారంభమైన రెండో దశ 420 సెకన్లకు 450 కి.మీ ఎత్తులోకి వెళ్లి పూర్తి చేసింది. అనంతరం మూడవదశ ప్రారంభమై 4.5 టన్నుల ఘన ఇంధనంతో వేగంగా 697 సెకన్లకు 475 కిలోమీటర్ల ఎత్తుకు చేరింది. అనంతరం 0.05 టన్నుల ద్రవ ఇంధనంతో నాలుగో దశ ప్రారంభమై రాకెట్‌లో ఉన్న ఈఓఎస్-08 ఉపగ్రహం 808 సెకన్లకు కక్ష్యలోకి విడిపోయింది. అనంతరం 994 సెకన్లకు ఎస్ఆర్-0, డెమోశాట్ ఉపగ్రహాలు కూడా ఒకదాని తరువాత రోదసీలోకి ప్రవేశపెట్టారు. సంవత్సరం పాటు ఈ ఉపగ్రహం సేవలందించనుంది.

- సూళ్లూరుపేట

ఇద్దరు ఏఎస్పీల బదిలీ

తిరుపతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచీ ఇద్దరు అదనపు ఎస్పీలు, ఒక నాన్ క్యాడర్ ఎస్పీ బదిలీ అయ్యారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో జిల్లా లా అండ్ ఆర్డర్ ఏఎస్పీ జె.కులశేఖర్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, క్రైమ్ విభాగ ఏఎస్పీ బీహెచ్ విమలకుమారి ఏసీబీకి బదిలీ అయ్యారు.కులశేఖర్ స్థానంలో బి.నాగ భూషణరావు నియమితులయ్యారు. ఆయన ఏసీబీలో పనిచేస్తూ సెబ్‌కు అటాచ్ చేయడంతో ఆ విభాగంలో ప్రస్తుతం శ్రీ సత్యసాయి పుట్టపర్తి జిల్లాలో పనిచేస్తున్నారు. తిరుపతి కేంద్రంగా నడుస్తున్న రెడ్ శాండర్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్‌లో నాన్ క్యాడర్ ఎస్పీగా పనిచేస్తున్న పి.శ్రీనివాసులు ఏపీ పోలీస్ అకాడమీకి బదిలీ అయ్యారు.

19న శ్రీసిటీకి సీఎం చంద్రబాబు రాక

తిరుపతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీసిటీకి ఈనెల 19వ తేదీన రానున్నారు. సీఎంవో నుంచి అందిన సమాచారం మేరకు చంద్రబాబు ఈనెల 19న తిరుపతి విమానాశ్రయం చేరుకుని అక్కడినుంచి హెలికాప్టర్‌లో శ్రీసిటీ వెళతారు. అక్కడ ఎనిమిది పరిశ్రమలకు భూమి పూజ చేయడంతో పాటు మరో 16 పరిశ్రమలను ప్రారంభించనున్నారు. అలాగే ఐదు పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి ఎంవోయూలు కుదుర్చుకోనున్నారు. శ్రీసిటీలోని బిజినెస్ సెంటర్‌లో భూమిపూజ, ప్రారంభోత్సవాల తర్వాత ఫాక్స్‌కాన్ పరిశ్రమల ప్రతినిధులతో సీఎం ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అనంతరం వివిధ పరిశ్రమల సీఈవోలతో సమావేశం నిర్వహించనున్నారు. సీఎం పర్యటనను పురస్కరించుకుని కలెక్టర్ డాక్టర్ సంజామల వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, వివిధ శాఖల అధికారులతో కలసి శుక్రవారం శ్రీసిటీలో పర్యటించారు. హెలిపాడ్‌ను, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

పసిడి చీరలో పద్మావతమ్మ

- తిరుచానూరులో ఘనంగా వరలక్ష్మి వ్రతం

తిరుచానూరు, ఆగస్టు 16 : తిరుచానూరులో కొలువైన పద్మావతీ దేవి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం కనులపండువగా వరలక్ష్మి వ్రతం జరిగింది.అమ్మవారి ఉత్సవమూర్తిని బంగారు చీరలో ఆస్థాన మండపంలోని పద్మపీఠంపై కొలువుదీర్చారు.సంప్రదాయ పుష్పాలతో ఆరాధించి అమ్మవారిని 9 గ్రంథులతో అలంకరించారు.12రకాల నైవేద్యాలను అమ్మవారికి నివేదించారు. ఉదయం 10గంటలకు ప్రారంభమైన వరలక్ష్మి వ్రతం మధ్యాహ్నం 12గంటలకు మహా మంగళహారతితో ముగిసింది.సాయంత్రం మహాలక్ష్మి అలంకరణలో స్వర్ణరథంపై కొలువుదీరిన పద్మావతీ దేవి మాడవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించింది.టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఆస్థాన మండపంలో ఏర్పాటు చేసిన వ్రత మండపం ఆకట్టుకుంది.20వేల కట్ ఫ్లవర్స్‌తో మూడు రోజుల పాటు 15మంది సిబ్బంది శ్రమించి అమ్మవారి ఆలయం, ఆస్థాన మండపం,వ్రత మండపాన్ని సుందరంగా అలంకరించారు.పద్మావతీ దేవిని దర్శించుకోవడానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు.సర్వదర్శనానికి గంటన్నరకుపైగా పట్టింది.ఎమ్మెల్యే పులివర్తి నాని, టీటీడీ ఈవో శ్యామలరావు,జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, వీజీవో నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.





స్వర్ణరథంపై ఊరేగుతున్న పద్మావతీ దేవి

ముస్లిం, మైనార్టీలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే కురుగొండ్ల



భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, ఆగస్టు 16: నియోజకవర్గంలోని ముస్లిం, మైనార్టీలకు తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 23 వార్డులో బొమ్మిడి కాలువ పక్కన ఉన్న పీర్లచావిడ వద్ద నూతనంగా నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్ భూమి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలుగుదేశం ప్రభుత్వం ముస్లిం, మైనార్టీల అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. రంజాన్ తోఫా వంటి పథకాలను ప్రభుత్వం తిరిగి ప్రారంభిస్తుందన్నారు. ఎన్నికల ముందు ముస్లింలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు తూ.చా. తప్పకుండా అమలు చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలలో తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద నాయుడు, వెంకటగిరి మున్సిపల్ వైస్‌చైర్మన్ బి. రాజేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, తిరుపతి పార్లమెంటు వాణిజ్య విభాగ అధ్యక్షుడు పి.విశ్వనాథనాయుడు, ఏ.సత్యనారాయణ, కె.శ్రీనివాసులు నాయుడు, టి.చంద్రారెడ్డి, మస్తాన్, కరిముల్లా, బాబూలాల్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఎమ్మార్పీఎస్ నాయకుల సన్మానం



డక్కిలి, ఆగస్టు 16: ఉపాధ్యాయ సమస్యలు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన విషయంలో రెవిన్యూ సమస్యలను పరిష్కరించాలని జిల్లా మాదిగ ఉద్యోగ సమాఖ్య ప్రధాన కార్యదర్శి డి.పెంచలయ్య తహసీలార్దర్‌ను కోరారు. శుక్రవారం ఉదయం డక్కిలి తహసీల్దార్ ఎం.శ్రీనివాసులును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాకప్పి సన్మానించారు. మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకుడు చింజీవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వన్‌వే ఏర్పాటు చేయండి



సీఐని సన్మానిస్తున్న కృష్ణయ్య

వెంకటగిరి, ఆగస్టు 16: పట్టణంలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని వన్‌వేలు ఏర్పాటు చేయాలని రాయల్ కాప్స్ అఖిల భారత జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కృష్ణయ్య సీఐకి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వెంకటగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏ.వెంకటరమణకు కాపు నేతలతో కలిసి ఈ మేరకు వినతి చేశారు.వెంకటగిరిలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలను సీఐ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కె.వెంకటేశ్వరరావు, కె.సాయికృష్ణ, పసుపులేటి విజయ ఉన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీడీవో సూర్యసాయి

చిల్లకూరు, ఆగస్టు 16: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ వెంకటరమణమ్మ అధ్యక్షత మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పలువురు ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల్లో నెలకొనివున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సూర్యసాయి మాట్లాడుతూ... తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి సమస్యను పరిష్కరించాలన్నారు. నీళ్లట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలన్నారు. పారిశుధ్యం మెరుగు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనుల్లో క్షేత్ర సహాయకులు లేని గ్రామాల్లో సీనియర్ మేట్ ద్వారా ఉపాధి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశుసంవర్థక శాఖ అధికారులు మినీ గోకులం పథకంలో షెడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరమణమ్మ, జడ్పీటీసీ సభ్యుడు శీనయ్య, వైస్‌ఎంపీపీలు కుమారస్వామిరెడ్డి, చెంగయ్య, తహసీల్దారు శ్రీనివాసులు, పలుశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి కొప్పెర కానుక



కొప్పెర గంగాళంతో కొప్పెర వంశస్థులు

తిరుమల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి శుక్రవారం కొప్పెర గంగాళాన్ని కొప్పెర వంశస్థులు అందజేశారు. తిరుపతికి సమీపంలోని కొప్పెరవాండ్లపల్లెకు చెందిన కొప్పెర వంశస్థులు సాయిసురేష్ తన సోదరులు కుమార్, కృష్ణమూర్తితో కలిసి శుక్రవారం కొప్పెర(హుండీ గంగాళం)తో ఆలయం చేరుకున్నారు. తనిఖీల అనంతరం ఆలయంలోకి తీసుకువెళ్లి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. సాయిసురేష్ మాట్లాడుతూ.. తాము 200 ఏళ్లుగా వంశపారపర్యంగా శ్రీవారికి కొప్పెర అందజేస్తున్నామని, రాగి, ఇత్తడి ఇతర లోహాలతో తయారు చేసిన ఈ గంగాళం బరువు 75 కేజీలు ఉంటుందని, తయారీకి దాదాపు రూ.2 లక్షలు అయ్యిందని తెలిపారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరం

కోట, ఆగస్టు 16 : బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరమని దీనిపై విస్తృత ప్రచారం చేయాలని సీడీపీవో మునికుమారి కోరారు. కోట పట్టణ పరిధిలోని నార్త్ గిరిజన కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బాల్య వివాహాలపై మహిళలు, కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ... బాల్య వివాహాలను అరికట్టె విషయంలో గ్రామస్తుల సహకారం అవసరమన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బాల్య వివాహాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ కృష్ణమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఉన్నారు.

వాజ్‌పేయికి నివాళి

కోట, ఆగస్టు 16 : పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ప్రధాని, స్వర్గీయ అటల్ బిహారి వాజ్‌పేయి 16వ వర్థంతి సందర్భంగా ఆయనకు పార్టీ నాయకులు నివాళి అర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ... రాజకీయాల్లో మచ్చలేని నాయకుడిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. అంబరీషా, వెంకటేశ్వర్లు, వెంకయ్యగౌడ్, పరుశురాంసాయి, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ వితరణ

చిల్లకూరు, ఆగస్టు 16: మండలంలోని నెలబల్లిరెట్టపల్లికి చెందిన దివ్యాంగుడు రమేష్‌కు శుక్రవారం చేడిమాలకు చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వీల్‌చైర్‌ను అందజేశారు. రెండు కాళ్లు చచ్చుపడి నడవలేని స్థితిలో ఉన్న రమేష్‌కు వీల్‌చైర్ అవసరం కావడంతో ట్రస్ట్ ఫౌండర్ రాజనేని శ్రీనివాసులునాయుడు అందించినట్టు ట్రస్ట్ సభ్యులు బాబు, పవన్ తెలిపారు.

నేడు మెగా వైద్య శిబిరం

నాయుడుపేట టౌన్: పట్టణంలోని ఏఎల్‌సీఎం క్రీడా మైదానంలో కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి, కస్తూరి ఫౌండేషన్ అధినేత పరసా వెంకటరత్నం తెలిపారు. తన భార్య కస్తూరమ్మ 4వ వర్ధంతి సందర్భంగా శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రేపు గూడూరులో వైద్య శిబిరం

గూడూరు అర్బన్, ఆగస్టు 16: పట్టణంలోని చిల్లకూరు శేషమ్మ మున్సిపల్ హైస్కూల్‌లో ఈనెల 18న ఆదివారం నిర్వహించనున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నియోజకవర్గంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. చెన్నైకి చెందిన కేవీటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వైద్యపరీక్షలు నిర్వహించడంతోపాటు మందులను అందిస్తామన్నారు.

పడిపోతున్న ధాన్యం ధరలు... ఆందోళనలో రైతులు!





విక్రయానికి సిద్ధం చేసి ఉన్న 1010 రకం ధాన్యం - లారీలోకి ధాన్యాన్ని లోడ్ చేస్తున్న కూలీలు

కోట, ఆగస్టు 16: ఎడగారు సీజన్‌లో నాటిన వరి పైర్లు ఇప్పుడిప్పుడే కోతలకు వస్తున్నాయి. అయితే రైతుల దగ్గర ధాన్యం పుష్కలంగా ఉండటంతో ధరలు రోజురోజుకు పతనమవుతున్నాయి. దీంతో రైతులు ఆందో ళన చెందుతున్నారు. సముద్రతీర ప్రాంతమైన కోట, వాకాడు, చిట్టమూరు మండలాలు ఎడగారు సీజన్‌లో ఫిల్టర్ పాయింట్లు, నేలబావుల కింద తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు ఇచ్చే 1010, ఏఎన్ఎం(సన్నాలు) రకాలను సాగు చేశారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది అధిక దిగుబడులు వచ్చాయి. మొదట్లో 1010 రకం ధాన్యం పుట్టి రూ.17వేల నుంచి రూ.18 వేలు పలకగా ప్రస్తుతం రూ.16,500 పలుకుతోంది. ధాన్యం దళారులు మొదట్లో 1010 రకం ధాన్యానికి మంచి ధరలు ఉన్నాయంటూ ప్రచారం చేశారు. ఇంతలో ప్రస్తుతం కర్ణాటకలోని తుమ్మకూరు తదితర ప్రాంతాల్లో ధాన్యం ధరలు పడిపోతున్నాయంటూ రోజురోజుకు ధరలను దిగజారుస్తున్నారు. అదే విధంగా 1638 కెఎన్ఎం (సన్నాలు) ఇటీవల వరకు పుట్టి రూ.22వేలు పలకగా ప్రస్తుతం ఇదే రకం రూ.20వేలు, రూ.20,200 మాత్రమే పలుకుతున్నాయి. ఈ రకం ధాన్యం ధరలు కూడా రోజురోజుకు పతనం అవుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. తమిళనాడు, కర్ణాటకలో ధరలు పడిపోయాయంటూ ప్రచారం చేస్తూ రైతుల నుంచి దళారులు కారు చౌకగా ధాన్యం కొనుగోలుచేసి కొల్లగొడుతున్నారు. ఈ ఏడాది ఎడగారు రైతులకు ధరల పరంగా అగాధంలోకి కూరుకుపోయారు.

సూళ్లూరుపేట రోడ్డుకు మరమ్మతులు





రోడ్డుకు ఇరువైపులా గుంతలకు తోలిన మట్టి - రోడ్డులో గుంతలపై వేసిన తారు

- అమల్లోకి పవన్ కల్యాణ్ ఆదేశాలు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 16: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో సూళ్లూరుపేట రోడ్డుకు మరమ్మతులను బుధవారం నుంచి చేపట్టారు. ఈనెల 13న షార్‌లో పర్యటించినప్పుడు బీఎన్‌కండ్రిగ నుంచి సూళ్లూరుపేటకు వచ్చే రోడ్డు గుంతలమయమై అధ్వానంగా ఉందని అధికారులు పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన వెంటనే మరమ్మతులు చేయించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు. దీంతో బీఎన్‌కండ్రిగ నుంచి సూళ్లూరుపేట మండలం పెరిటిపాడు వరకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఏర్పడిన గుంతలకు మట్టి తోలి రోలింగ్ పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా రోడ్డును విస్తరించాలి

బీఎన్‌కండ్రిగ నుంచి సూళ్లూరుపేట వరకు డబుల్ రోడ్డు విస్తరణ పనుల కోసం గత వైసీపీ ప్రభుత్వంలో రూ.12కోట్లు మంజూరు చేశారు. ఈ పనులకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 2021 ఆగస్టు 8న బీఎన్ కండ్రిగ మార్కెట్ యార్డు దగ్గర ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అయితే పనులు కల్వర్టు నిర్మాణాలతో ఆగిపోయాయి. సూళ్లూరుపేట బైపాస్ నుంచి పెరిడిపాడు వరకు 9 కిలోమీటర్ల రోడ్డు పనులు మాత్రం పూర్తి చేశారు. దీంతో బీఎన్‌కండ్రిగ నుంచి సింగిల్ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. తడ, సూళ్లూరుపేట పరిసరాల్లో ఉన్న పరిశ్రమల కార్మికులతో పాటు రైలు మార్గంలో సూళ్లూరుపేట నుంచి చెన్నై, విజయవాడలకు వెళ్లే ప్రయాణికులు అధిక సంఖ్యలో ఈ రహదారి నుంచే వెళుతుంటారు. సింగిల్ రోడ్డు కావడానికి తోడు ఇరువైపులా గుంతలు వాహనదారులకు ప్రాణసంకటంగా మారాయి. రహదారి పక్కకు దిగితే గోతిలో పడడం, దిగకుండా రహదారి అంచులో వెళితే ఎదురుగా వచ్చే వాహనాల వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా ఈ రోడ్డును విస్తరించాలని కోరుతున్నారు.

వైభవంగా వరలక్ష్మి వ్రతం







కలవకొండ, సూళ్లూరుపేట, చిన్నమాంబట్టుల్లో వరలక్ష్మి వ్రతాన్ని ఆచరిస్తున్న మహిళలు





గాజుల అలంకరణలో నాయుడుపేట పోలేరమ్మ - బంగారు చీరలో కనుపూరు ముత్యాలమ్మ

చిల్లకూరు, ఆగస్టు 16: మండలంలో వరలక్ష్మీవ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తూర్పు కనుపూరులో కొలువై ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజల అనంతరం బంగారు చీర అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయంలో మహిళా భక్తులు వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కలవకొండలో కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీ అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేకపూజలు జరి పారు. ఈ ఆలయంలో కూడా వరలక్ష్మీవ్రతాన్ని మహిళలు నోచుకున్నారు.

గూడూరు: పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సొసైటీ కాలనీలోని నారాయణమ్మ ఆలయంలో, బజారు వీధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో, జడ్పీ హైస్కూల్ రోడ్డులోని రాజరాజేశ్వరిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సరస్వతిశిశు మందిర పాఠశాలలో శుక్రవారం వరలక్ష్మీవ్రతం నిర్వహించారు.

సూళ్లూరుపేట: మండలంలో వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మద్వేంకటరామ్మూర్తి ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసి ఉన్న గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో వరలక్ష్మి వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలేరమ్మను గాజులతో అలంకరించారు. వేకువజామున నుంచే భక్తులు పోలేరమ్మను దర్శించుకున్నారు. అలాగే శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి, కన్యకా పరమేశ్వరి, అంకమ్మ, మహాలక్ష్మి, మానసాదేవి, దుర్గాదేవి ఆలయాల్లో కూడా వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహించారు.

డక్కిలి: మండలంలోని యోగాలక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా మహలక్ష్మి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు సాముహిక వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి నృసింహ స్వామి మూలమూర్తులకు అభిషేకం నిర్వహించారు. అనతంరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంపై అమ్మవారి ఉత్సవ విగ్రహన్ని కొలువు దీర్చి వరలక్ష్మిదేవిగా అలంకరించి వ్రతం ఆచరించారు. నిర్వాహకులు సుబ్బారావు, విజయకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తడ: మండలంలోని చిన్నమాంబట్టులో కొలువై ఉన్న కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణాదేవి ఆలయంలో వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం కుంకుమపూజ, విష్ణు సహస్ర నామార్చన, గోపూజలు జరిగాయి. అనంతరం వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. కార్యక్రమాలకు స్వామిరెడ్డి దేవేంద్రరెడ్డి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించగా, తిరుపతి స్విమ్స్ వైద్యుడు మునస్వామి పర్యవేక్షించారు.

మట్టి అక్రమ తరలింపు అడ్డగింత



బాలయపల్లి, ఆగస్టు 16: మండల పరిధిలోని మన్నూరులోని భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలను శుక్రవారం దళితులు అడ్డుకున్నారు. మట్టి మాఫియా దళితుల భూముల్లో ఎక్స్‌కవేటర్లతో లోడి వాహనాల్లో నింపి మట్టిని తరలి ంచడానికి యత్నించింది. సమాచారం తెలుసుకున్న స్థానికులు పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు సంఘటనాస్థలికి చేరుకుని మట్టి తరలింపును అడ్డుకున్నారు.

గౌతు లచ్చన్న త్యాగాలు మరువలేనివి



గూడూరు, ఆగస్టు 16: స్వాతంత్ర్య సమర యోధుడు సర్దార్ గౌతు లచ్చన్న త్యాగాలు మరువ లేనివని గౌడ సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం తాళమ్మ ఆలయంలోని కల్యాణ మండపంలో గౌతు లచ్చన్న జయంతిని నిర్వ హిం చారు. అనంతర అన్నదానం చేశారు. చిట్టెం శ్రీనివాసులు, బలరామయ్య, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులపై ఇటుక బట్టీ యజమాని వేధింపులు

- అడ్వాన్స్ తిరిగి ఇవ్వాలని దాడి
- యువకుడి నిర్బంధం
- విడిపించిన పోలీసులు



పోలీస్ స్టేషన్ వద్ద గిరిజనులు

పెళ్లకూరు, ఆగస్టు 16: ఇటుక బట్టీల యజమాని అడ్వాన్స్ చెల్లించి పనులు కల్పించకుండా వేధింపులకు పాల్పడ్డాడు. విసిగిపోయిన కూలీలు తిరిగి ఇళ్లకు చేరారు. దీంతో తాను ఇచ్చిన అడ్వాన్స్ తిరిగి చెల్లించాలని వారిపై దాడికి పాల్పడ్డాడు. వారి కుటుంబాల్లోని యువకుడిని నిర్బంధించాడు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిర్బంధంలో ఉన్న ఆ యువకుడిని విడిపించారు.

పెళ్లకూరు మండలంలోని శిరసనంబేడు రాజుపాళెంకు చెందిన ఓ వ్యక్తి ఇటుక బట్టీల వద్ద పనులకు కానూరు రాజుపాలెం గిరిజన కాలనీకి చెందిన నాలుగు కుటుంబాలకు చెందిన 10 మందిని మాట్లాడుకున్నాడు. అడ్వాన్స్‌గా రూ.30వేలు చెల్లించాడు. దీంతో నాలుగు కుటుంబాలు ఇటుక బట్టీల వద్దకు చేరుకున్నారు. అయితే అప్పటి నుంచి వారికి సక్రమంగా పనులు కల్పించక పోగా భోజన వసతి కూడ ఏర్పాటు చేయలేదు. దీంతో విసిగి వేసారి తిరిగి స్వగ్రామానికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఇటుక బట్టీల యజమాని గురువారం రాత్రి గిరిజనులపై దాడికి పాల్పడ్డాడు. శ్రీనివాసులు(20)ను తన ఇంటి వద్ద నిర్బంధించాడు. బాధిత గిరిజనులు పెళ్లకూరు పోలీసులను ఆశ్రయించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అదేరోజు రాత్రి యువకుడిని విడిపించి కుటుంబసభ్యులకు అప్పజెప్పారు. కాగా శుక్రవారం ఉదయం ఆ వ్యక్తి మరోసారి గిరిజన కాలనీకి చేరుకుని అడ్వాన్స్ తిరిగి ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడ్డాడు. గిరిజనులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని బట్టీ యజమానిపై రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ... బాధితుల ఫిర్యాదు మేరకు వాస్తవాలు తెలుసుకుని చట్టపరమైన చర్యల తీసుకుంటామని తెలిపారు.

సంక్షేమం.. అభివృద్ధి టీడీపీకి రెండు కళ్లు



సిమెంట్ రోడ్డు నిర్మాణ భూమిపూజలో నెలవల తదితరులు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 16: సంక్షేమం, అభివృద్ధి టీడీపీకి రెండు కళ్లలాంటివని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని పాత బీఎంఆర్ నగర్‌లో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్ల భూమిపూజలో మున్సిపల్ చైర్‌పర్సన్ కె.దీపికతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్‌లో పథకాలను అమలు పరుస్తున్నారని తెలిపారు.మున్సిపల్ వైస్‌చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జనార్ధనరెడ్డి పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్ సీఐకి తప్పిన ప్రమాదం



డివైడర్‌పై నిలిచి ఉన్న కారు

దొరవారిసత్రం, ఆగస్టు 16: నాయుడుపేట టౌన్ సీఐ బాబికి శుక్రవారం తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. దొరవారిసత్రం మండలం వేణుంబాక క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై ఆయన ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. శ్రీహరికోట నుంచి నాయుడుపేటకు వెళ్తుండగా కారు కుడివైపు చక్రం కనెక్టివ్ రాడ్ విరిగి పోవడంతో వాహనం అదుపు తప్పింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించ డంతో ప్రమాదం తప్పింది. దీంతో వాహనం బోల్తా పడకుండా ఆగింది.

నగదు ప్రోత్సాహకం



గూడూరు, ఆగస్టు 16: బలిజ విద్యార్థినులు చదువులలో రాణిం చేందుకు బలిజ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు ఆ సంఘ గౌరవాధ్యక్షురాలు సారంగం సులక్ష్మి చెప్పారు. శుక్రవారం బనిగీ సాహెబ్ పేటకి చెందిన మాధురికి బలిజ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్థికసాయాన్ని అందజేశారు. ప్రతిభావంతులైన విద్యార్థినులకు తమ సంఘం ద్వారా చేయూతనిస్తామన్నారు. లక్ష్మీ, ఉమాదేవి, ఉషా, రాధ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చిల్లకూరు, ఆగస్టు 16: మండలంలోని కోట క్రాస్‌రోడ్డు సమీపంలో శుక్రవారం సెబ్ అధికారులు నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. కోట క్రాస్‌రోడ్డు సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా నాయుడుపేట నుంచి గూడూరు వైపునకు ఏలాంటి ధృవీకరణ పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

మాచవరం చేపల చెరువు వేలం

ఓజిలి, ఆగస్టు 16: మండలంలోని మాచవరం చెరువులో చేపలను శుక్రవారం సర్పంచి మోనిక ఆధ్వర్యంలో వేలం వేశారు. జూలైతో ప్రారంభమైన కొత్త ఫసలీ నేపథ్యంలో వేలం వేసేందుకు రెండు పర్యాయాలు చేసిన ప్రయత్నం గ్రామంలోని ఓ వర్గం ఆందోళనతో విఫలమైంది. దీంతో శుక్రవారం తిరిగి వేలం నిర్వహించేందుకు అధికారులనుంచి అనుమతి తీసుకుని భారీ పోలీసు బందోబస్తు నడుమ పూర్తి చేశారు. వేలం ధరావతుగా రూ.47,500 నిర్ణయించగా ఇద్దరు మాత్రమే వేలంలో పాల్గొన్నారు. రూ.1.94 లక్షలకు గ్రామానికి చెందిన రవి దక్కించుకున్నారు. నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, ఓజిలి, పెళ్లకూరు ఎస్ఐలు రవిబాబు శ్రీకాంత్‌తోపాటు 20 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు

పెళ్లకూరు, ఆగస్టు 16: నాయుడుపేట - రేణిగుంట మధ్య నిర్మిస్తున్న 71వ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అండర్ పాస్ వద్ద రోడ్డుకు ఇరువైపుల విద్యుత్ దీపాలను అమరుస్తుండగా చేస్తుండగా విద్యుదాఘాతంతో వలస కూలీ గాయపడ్డాడు. బిహార్‌కు చెందిన రంజిత్‌కుమార్ కూలీలతో కలసి విద్యుత్ స్తంభాలకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈక్రమంలో 33/11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. రంజిత్‌కుమార్‌ను సంస్థ సిబ్బంది పెళ్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు.

కోట ఎస్ఐగా పవన్‌కుమార్



కోట, ఆగస్టు 16 : కోట సబ్ ఇన్‌స్పెక్టర్‌గా శుక్రవారం కె. పవన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎస్ఐ నాగబాబు బాధ్యతలు అప్పగించారు. పవన్‌కుమార్ వాకాడు ఎస్ఐగా పనిచేస్తూ కోట ఎస్ఐగా బదిలీపై వచ్చారు. పోలీసులు ఆయన్ను అభినందించారు.

ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి



తనిఖీల సందర్భంగా మాట్లాడుతున్న డీఎస్పీ

కోట, ఆగస్టు 16: ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు గూడూరు డీఎస్పీ రమణకుమార్ తెలిపారు. కోట పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం రాత్రి డీఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈవ్ టీజింగ్‌పై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. రోడ్లపై ఎక్కువసేపు వాహనాలు ఉంచితే జరిమానాలు విధిస్తామన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఎస్ఐ పవన్‌కుమార్ ఉన్నారు.